# HANNA KRUPA ®

Christian Devotional Monthly Magazine

సంపుటి : 11 సంచిక : 4

ప్రభువగు యెహోవాయే నాకు బలము

## విషయసూచిక


| | | |
|---|---|---|
| జీవనమంతయు... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| విలియంకేరి... | ఆంద్రూస్ దావల, గుంటూరు | 4 |
| హోషేయ | కొడవటికంటి | 6 |
| సువార్తికుడిగా జాన్‌డేవిడ్ | అరుణ్‌కుమార్ కె. మహంతి, సి.హెచ్.పేట | 8 |
| బీదలను కటాక్షించువాడు... | బి.ఇశ్రాయేలు, వారి సహచరులు | 10 |
| బిషప్ డా॥ మూర్తోడి సంపత్ శాంతవర్ధన్ | కొడవటికంటి | 12 |
| అక్టోబర్ నెల ప్రశ్నలు | శ్రీ పంతగాని గ్రేషియస్ , ఏలూరు | 15 |
| విశ్వాసంలో ... | కొడవటికంటి | 16 |
| క్రీ॥శే॥వై.యస్.చిన్నకొండారెడ్డి | శ్రీ.వై.యస్.ప్రకాశ్ రెడ్డి , పులివెందుల | 20 |
| సాక్ష్యము | శ్రీమతి ఉండవల్లి ఉమా లక్ష్మణరావు | 22 |
| నిజం దేవునికి తెలుసు కానీ ... | లియో టాల్‌స్టాయ్ | 24 |
| వాక్యంలోని వనితలు | శ్రీమతి మెర్సీ ఇశ్రాయేలు, నెల్లూరు | 27 |
| యేసుకథ | కొడవటికంటి | 29 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 31 |


**కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర**

చీఫ్ ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ - 51, డోర్ నెం.54-1-23(ఎ)

కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు-523 001

**9866716506**

**సంవత్సర కానుక : రూ. 200/-**

ఆన్‌లైన్ అకౌంట్ నెం. : 10957294362

బ్రాంచి నెం. : 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అకౌంట్ హోల్డర్ : కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు

సెల్ : 9866 716 506

# జీవనమంతయు...



ధనవంతుడైన యవ్వనస్తునితో యేసుప్రభువు నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము అన్నాడు. అంటే నీ **జీవనమంతయు...** అని అర్థము.

ఆనాడు ఆ ధనవంతుడైన యవ్వనస్తుడే కాదు, ప్రక్కనున్న వారు కూడా యేసునోట ఆ మాట వస్తుందని ఊహించియుండరు. కాని ఇది యదార్థము. ఆయన చెప్పిన మాట ప్రకారం చేస్తేనే అతని ప్రశ్నకు జవాబు వస్తుంది. ఆ జవాబు రానంతకాలము అతనికి ఈ లోకంలో నెమ్మది, సంతోష సమాధానములు రావు.

యేసుప్రభువు అప్పుడు ఆ పరిస్థితులను బట్టి ఆమాట సెలవిచ్చాడు. ఈనాడు మనకు సెలవియ్యటం లేదా? ఈ లోకంలో ఎంత డబ్బును మనం కలిగియుండే దానిని బట్టి మన సుఖసంతోషాలు ఆధారపడియుండవు. **పరలోకంలో నీకు ధనము కలుగును.** అంటే ఈ లోకములో మన స్థితి ఎట్లున్నప్పటికి మనం సుఖసంతోషాలతో ఉండా లంటే పరలోకములో మనము ధనము కలిగి ఉండాలని అర్థము.

ప్రతి ఒక్కరు పరలోకములో బ్యాంక్ బ్యాలెన్స్ కలిగియుండవచ్చును. ఈ ధనవంతునికి ఈ లోకములో ఎంతో ధనమున్నది. కాని పరలోకములో అతనికి ధనము లేదు.

పరలోకములో మనం దాచుకున్న డబ్బు మనం పరలోకము వెళ్ళిన తర్వాత వాడుకోవడానికి కాదు. ఇక్కడ ఈ లోకములో జీవిస్తూనే అవసరానికి పరలోకములోని డబ్బును వాడుకోవచ్చును. దాన్ని ఆపరేట్ చేసేది మన పరమతండ్రి!

నేను నా సంచారములో అంటే పత్రిక సంపా దకునిగా ఒరిస్సానుండి చెన్నై వరకు, ఒంగోలునుండి పులివెందుల, కర్నూలు వరకు గమనించినది ఈ సత్యమే! ఈ లోకములో ధనవంతులుగా ఉండిన వారికంటే ధన హీనులుగా ఉన్నవారే పరలోకములో ధనము కూర్చుకోవడం గమనించి ఆశ్చర్యపోయాను. ఇప్పటికి ఆలోచిస్తుంటే పరలోకములో ధనము కూర్చుకొనిన వారి ఇంటిలోను, హృదయములోను సమృద్ధి కలిగివున్నారు. తృప్తి - సమృద్ధి కలిగియున్నారు.

అసలు దేవుని దగ్గర (పరలోకములో) ధనము దాచుకుంటున్నాము అని తెలియకుండానే, ఆలోచన లేకుండానే వారు ప్రతిరోజు పరలోకములో ధనము కూర్చుకొంటున్నారు.

కానుక పెట్టెలో తమ కానుకలు వేయుచున్న **ధనవంతులను** ఆయన పారచూచెను. వారు నిజంగా ధనవంతులు. గొప్ప కానుకలు అందులో వేస్తున్నారు. ఒక బీద విధవరాలు వచ్చింది. ఆమె నిజానికి యేసు దృష్టిలో నిజమైన ధనవంతురాలు. పరలోకములో ఆమె ఎంత ధనము కూర్చుకున్నదో యేసుకు తెలుసు.

మన దగ్గర మన అవసరాలకు ఉంచుకొని తరువాత దేవునికివ్వటం కాదు. మన దగ్గర ఉన్నది, జీవనమంతయు... దేవునికి ఇచ్చి దానికి ఎన్నోరెట్లు రెట్టింపు దీవెనలు తీసుకొంటున్న ఆ విధవరాలు ఆయన దృష్టిని ఆకర్షించింది.

ఇప్పుడు మన జీవితం - భవిష్యత్తు మీద, సంపాదన మీద, మన వనరుల మీద ఆధారపడతాము. దానిలో అలవాటుపడతాము. అస్థిరమైన ధనమునందు నమ్మికయుంచక సుఖముగా అనుభవించుటకు మనకు ధారాళముగా దయచేయు దేవునియందే నమ్మక యుంచాలి.

వాస్తవమైన జీవమును సంపాదించుకొను నిమిత్తము రాబోవు కాలమునకు మంచి పునాది తమ కొరకు వేసుకొనుచు, మేలు చేయువారును, **సత్క్రియలు అను ధనము గలవారును,** ఔదార్యము గలవారును తమ ధనములో ఇతరులకు పాలిచ్చువారునై యుండవలెను. అదే - నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము అనే దానికి అర్థము.

# విలియం కేరి - మహనీయ జీవితం

6

రచన - ఆంద్రూస్ దావల

జీవితాంతం విలియంకేరి బాప్టిస్ట్ క్రైస్తవుడిగా జీవించినా, ఇతర క్రైస్తవ మతశాఖల వారితో సత్సంబంధాలు నెలకొల్పుకున్నాడు. ఇటు స్వదేశమైన ఇంగ్లాండ్‌లోను, అటు తన ఉద్యమ స్థావరమైన భారతదేశంలోను ఇతర క్రైస్తవ మతశాఖలకు చెందిన ఎందరో క్రైస్తవ మతనాయకులు కేరి మిత్రులుగా సుస్థిరమవడానికి శాఖాబేధం కేరికి అడ్డుకాలేదు. పైగా కేరి విశాల దృక్పధం వారి మధ్య వారధిగా నిలచింది. అవకాశం దొరికినప్పుడల్లా అన్ని శాఖల చర్చిలలో, సభలలో ప్రసంగిస్తూనే ఉండేవాడు. భావగర్భితమైన ఆయన ప్రసంగాలు వేలాది క్రైస్తవుల ప్రశంసలందుకున్నాయి. ప్రవచన వరమున్న ఒక స్త్రీ, “భవిష్యత్తులో కేరి గొప్ప ప్రసంగీకుడవుతాడని” జోస్యం కూడా చెప్పింది. ఆ విషయం ఎంతోకాలం తరువాత ఆయన చెవిన పడింది. ఓ మారు విలియంకేరి తండ్రి, ఆయన ప్రసంగించిన ఆరాధనలో పాల్గొన్నాడు. ప్రసంగం వింటున్న తండ్రికి ఆనందంతో కళ్ళు చెమరాయి. అభినందనగా కేరిని కౌగిలించుకొని పెల్లుబికిన ఆవేశాన్ని ఒక్క ముద్దుతో అదుపులో పెట్టుకున్నాడు. అంతకు మించిన భాగ్యం ఏ కన్నతండ్రికి లభిస్తుంది? అంతకు మించిన అభినందన ఏ కన్న బిడ్డ కనుభవ మవుతుంది?

దేవుని సేవకు వెలకట్టి జీతభత్యాలు ఆశించేవారు - కేవలం ఉద్యోగధర్మం నిర్వర్తించేవారు మాత్రమే వారి మనుగడలో, మాటల్లో , చేతల్లో అంకిత భావముండదు. ఉద్యమస్ఫూర్తి నిర్వీర్యమవుతుంది. విలియం కేరి ప్రతి ఆదివారం ఆరు మైళ్ళ దూరంలో హేగిల్టన్ పట్టణంలోని చర్చికి కాలినడకన వెళ్ళి ప్రసంగించి వచ్చేవాడు. అందుకు ఆయన ఏ జీతమూ ఆశించలేదు. తన పరమతండ్రి స్వకార్యం కదా! అదే ఆయన కర్తవ్యం. “కేరి కాటేజ్” అనే పేరుతో ఆ పట్టణంలో ఉన్న గృహం ఈనాడు క్రైస్తవ లోకానికి దర్శనీయ యాత్రాస్థలమయింది. ఎందరో విద్యావంతులకు ఆ కుటీరం చర్చా వేదికగా భాసిల్లుతుంది.

కేరి పనిచేస్తున్న చెప్పుల కార్ఖానా విశ్వాసుల సందర్శనలతో చాలా బిజీ అయిపోయింది. మత చర్చలు జోరుగా సాగుతుండేవి. తనకు బ్రతుకుదెరువైన స్థలంలో కూడా దేవుని పరిచర్య జరగడం కేరికెంతో సంతృప్తినిస్తూ ఉంది. విలియం కేరి జ్ఞానదాహం ఏనాటికీ తీరేది కాదేమో ననిపిస్తూ ఉంది. విలియం కేరి తీరికగా కూర్చోనుండడం బహుశా ఎవరూ చూసుండరేమో! ఏ కాస్త తీరిక సమయం దొరికినా గ్రంధపఠనంలో మునిగిపోయేవాడు. ఆ పఠనంలో మింగుడు పడని విషయాలేమైనా పొందుపరిస్తే, సైద్ధాంతిక సమస్యలేమైనా ఉంటే, విశ్లేషణ కోసం ఏ విద్యాధికుల్నో, పండితుల్నో ఆశ్రయించి పరిష్కరించుకునేవాడు.

తర్కవితర్కాల వేదికగా, చర్చా గోష్ఠుల కేంద్రంగా, కేరి పనిచేసే కార్ఖానా జ్ఞానదాహార్తుల చలివేంద్రంగా విరాజిల్లుతుండేది. ఆనాడు, ఆ చెప్పుల కార్ఖానాకు వేలాడ దీసిన “ఓల్డ్ చప్పల్స్ షాప్” అనే బోర్డు ఈనాటికీ ఆక్స్‌ఫర్డ్ ఏజంట్ కాలేజిలో ప్రముఖంగా కనిపిస్తుంది. ఎంతగా ఈతిబాధలకు లోనయినా నికృష్ట పేదరికపు నాగటి చాళ్ళలో విత్తబడి, స్వయంకృషితో, ఆ పరమరైతు కనుసన్నలలో ఏపుగా పెరిగిన వటవృక్షం ఈ విలియం కేరి. జానపద గాధల సరళిలో కేరి జీవితం ఎన్నో నాటకీయ మలుపులకు అలవాటయింది. ఏనాడూ ఆయన జీవితం సాఫీగా సాగలేదు. చెప్పులు కుట్టి సంపాదించుకునే ఉపాధి గనుక కుటుంబ పోషణ కష్టతరంగానే ఉండేది. అయినా ప్రశాంత వాతావరణంలో కొనసాగుతుందా అంటే అదేమీ లేదు. యజమాని మరణంతో కార్ఖాన మూతబడింది. మరో గత్యంతరం లేక మరో పట్టణంలో అదే పని కుదుర్చుకున్నాడు. దాని యజమాని డియోల్డ్ మంచివాడే. దురదృష్టవశాత్తు అనతికాలంలోనే ఆయన కూడా గుండెపోటుతో కాలధర్మం చెందాడు. మునుపటి కార్ఖానాలాగ ఇది శాశ్వతంగా మూతపడడానికి వీలులేకపోయింది. గతించిన యజమానిది పెద్ద కుటుంబం.

ఆ కార్ఖానే కుటుంబమంతటికీ జీవనా ధారం. ఆ కుటుంబం వీధులపాలు గాకుండా సంరక్షించే నైతిక బాధ్యత కేరిపై బడింది. డియోల్డ్ బ్రతికుండగా చేసిన ఒప్పందం ప్రకారం ఆయన మరదలు డోరతి ప్లాకెట్‌ను వివాహమాడి, ఆ అనుబంధంతో కుటుంబభారాన్ని నెత్తిన వేసుకున్నాడు. ఇదొక వింతయిన వివాహబంధం. డోరతి విధవరాలు. పైగా కేరి కన్నా పదేళ్ళు పెద్దది. అంత వరకైతే ఎలాగో ఒకలాగు సర్దుకుపోవచ్చు. ఈ అవలక్షణాలకు తోడు, ఆమె జగమెరిగిన మానసిక రోగి. ఆమెకు ఎప్పుడు కోప మొస్తుందో, ఎప్పుడు గయ్యాళి రూపమెత్తి ఇల్లంతా ఒక కొలిక్కితెస్తుందో ఊహించడం దుర్లభం. కుటుంబసభ్యు లందరికీ ఆమె నరకం సృష్టించని రోజంటూ ఉండదు. ఆ నరకాగ్నికి అందరూ శలభాలవుతారు. ఆమెకెప్పుడూ అందుబాటులో ఉండే శలభశ్రీ విలియంకేరి మాత్రమే.

అలాంటి చపల చిత్తరాలితో 26 ఏండ్లు కాపురం చేసిన విలియం కేరిని – సహనానికి మరో పేరుగా భావించు కోవచ్చు. సహచరుల బలహీన బంధాలతో తానొక బాధితుడుగా బలయిన విలియం కేరికి ఆశారేఖ ఒక్క క్రీస్తే. బాధామయ బ్రతుకులో అపోస్తలుడైన పౌలుకు ఆ ప్రభువు కృప దయచేసినట్లుగానే, కేరికి కూడా ఆ ఏసుస్వామి – కృప మీద కృపలు కుమ్మరించాడు. ఆ పరిస్థితుల్లో విషజ్వరం సోకి కేరిని అతలాకుతలం చేసింది. వ్యాధి నిమ్మళించేసరికి, తల వెంట్రుకలన్ని రాలిపోయి బట్టతలయింది. అక్కడనుండి మకాం మార్చక తప్పలేదు. మోల్టన్ పట్టణానికి వెళ్ళి, రిఫర్మేషన్ చర్చి సభ్యత్వం స్వీకరించాక, కేరి జీవితంలో సమూలంగా మార్పులొచ్చాయి. చర్చి సుభ్యులు, ఆయన వ్యక్తిత్వం, తలాంతుల్ని గుర్తించి, అక్కడ పరిచర్య చేస్తున్న ఫాదిరికి సహాయకుడిగా కేరిని నియమించారు. ఆ చర్చిలో పరిచర్య కొనసాగిస్తుండగా కేరి జీవిత సరళిలో అనూహ్య మయిన పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆ సేవలో అపారమైన ఆనందం, సంతృప్తి లభించడమే గాకుండా జీవింతాంతం ఆ సేవలోనే స్థిరపడి తన మనుగడ సాగించా లనే ధృఢ నిర్ణయానికొచ్చాడు కేరి. ఇంతలో మోల్డన్ నగర చర్చిలో ఫాదిరి స్థానం ఖాళీ అయింది. కేరి ఆ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకున్నదే తడవుగా, సభ్యుల ఆమోదం లభించింది. కొన్నాళ్ళు శిక్షణా తరగతులు ముగించాక విలియంకేరి ఆ చర్చి ఫాదిరిగా చేరి 1779 సంవత్సరాంతం వరకూ అక్కడే పరిచర్య చేసాడు. ఆ తర్వాత లీసెస్టర్ పట్టణంలోని ఆర్విన‌ల్ బాప్టిస్ట్ చర్చినుండి ఆహ్వానమందుకుని అక్కడకూడా ఫాదిరిగా చేరి 1793లో భారతదేశానికి ప్రయాణం కట్టేంత వరకూ అక్కడే పరిచర్య చేస్తూ, తన భవిష్యత్ కార్యక్రమానికి మెఱుగులు దిద్దుకున్నాడు.

కేరి స్వభావం విచిత్రమైన వ్యవస్థలాంటిది. మనుగడలో, మనస్థత్వంలో అతనికతనేసాటి. సహచరులెవ్వ రితో సామ్యముండదు. ఏ విషయంలోనైనా బాధ్యత రాహిత్యాన్ని ఆయన ద్వేషించేవాడు. విశ్రాంతిని విసుక్కునే వాడు. రోజు రోజుకూ తన పరిచర్యలోనే ఆనందాన్ని వెదక్కు నేవాడు. ఏ పనిలోనైనా దినదినాభి వృద్ధి నాశించేవాడు. కోరికలు తీరాలని కోరుకునేవాడు. ముందుగా ప్రజల గుర్తింపు పొందాలనీ, వారి ఆదరణ సంపాదించుకోవాలని ఉత్సాహించేవాడు. ఆశయాలకు తగిన అర్హత లేని ఆశలకు అర్థమేలేదని కేరి వాదం. ఏనాటికైనా క్రైస్తవ మిషనెరీగా విదేశాలలో సేవ చేయాలనేది విలియం కేరి చిరకాల వాంఛ. ఆ సోపానంలో తొలిమెట్టుగా తాను అభిషిక్తుడవ్వాలి. ఆ మేరకు 1786 ఆగష్టు 10వ తేదీన బాప్టిస్ట్ చర్చిలోనే అభిషక్తుడయ్యాను. రెవ. రైలండ్, రెవ.సర్కిల్, రెవ. పుల్లర్ సామూహికంగా విలియం కేరిని అభిషేకించారు. ఆ ముగ్గరే ముందు కాలంలో ఆయనను మిషనెరి సేవకు ప్రోత్సహించి, భారతదేశంలో కేరి మిషనరీ ఉద్యమానికి అండగా నిలిచారు. విలియం కేరి కోరికల మేరకే అభిషక్తుడై, మోల్టన్ చర్చికి కాపరిగా విస్తృత పరిచర్య చేస్తున్నా, ఆర్థిక అస్థిరత్వం ఆయన సేవకు ఆటంకంగానే ఉంది. ఆశయాలకు సమాంతరంగా దారిద్ర్యం పయనిస్తూనే ఉంది. ఉద్యోగరీత్యా ఆయనకిచ్చే జీతం కుటుంబ పోషణ కేమాత్రం చాలేదికాదు. మరొక పనేదయినా చేసి మరికొంత డబ్బు సంపాదించు కోవాలన్నా ఆయనకు దేవుడప్పగించిన పరిచర్యకే ఇరవై నాలుగ్గంటలూ సరిపోవు.

# హోషేయ (రక్షణ)

హోషేయ బైబిలులోని పాత నిబంధనలోని చిన్న ప్రవక్తలు పన్నెండు మందిలో మొదటివాడును అతని పేరు మీద ఉన్న గ్రంధ రచయిత – ఇరవై ఎనిమిదవ పుస్తకము ఇశ్రాయేలు ఉత్తరాది రాజ్యములో నుండి వచ్చిన మొదటి ప్రవక్తల గ్రంధమైయున్నది.

క్రీస్తు పూర్వం ఎనిమిదవ శతాబ్ధి రెండవ మధ్య కాలంలో రెండవ యెరోబాము పరిపాలనలో జన్మించాడు. రెండవ యెరోబాము మరణించిన తర్వాత ఉత్తరాది రాజ్యము పతనమయ్యేటప్పుడు జీవించాడు. ఇతని తండ్రి బేరీ మొదటి దినవృత్తాంతముల గ్రంధములో పలకరించ బడిన బేయేరిగా గుర్తించారు. అతను రూబేనీయుల రాజ వంశపువాడై తిగ్గత్పెసరు ద్వారా అష్యూరునకు చెరగొని పోబడినాడు. బైబిలు రచనలు ముగిసినతర్వాత వ్రాయబడిన చరిత్రలో ఈ బేరీ కూడా ప్రవక్తయైయుండెనని, అతని ప్రవచనాలు యెషయా గ్రంధములో కలుపబడినవని కొందరు చెబుతారు. యూదుల 'తలమండ్' ప్రకారము 'బేరి' అనేది మనిషి పేరు కాదుగాని అది కుటుంబపు పేరు అని అన్నారు.

ఈ ప్రవక్త సొంత ఊరు కూడా ఇరకాటములోనే ఉన్నది. దక్షిణ దేశములో ఉన్న పట్టణములయిన రామా – గిబియోను బెత్లేహేములో ఉన్న పరిచయము ప్రకారము బెన్యామీను గోత్రకుల నివాసస్థలములో నివశించాడని, అది ఉత్తరాది – దక్షిణాది రాష్ట్రాల మధ్యలో ఉన్నదని యిర్మియా ప్రవక్త ప్రవచనాలలో హోషేయ పలుకుబడి ఎక్కువగా ఉన్నదని చెబుతారు. హోషేయ ఇశ్శాఖారు గోత్రమునకు చెందినవాడు. లాటిన్ వల్గేటులో ఆయన 'బేత్షమేషు' నగరవాసి అని పరి.జరీము వ్రాశారు.

హోషేయ, ఆమోసు ప్రవక్త సమకాలీకుడు. ఆమోసు యొక్క ప్రవచనాలను హోషేయ చదివివుంటాడు. లేక బేతేలు మందిరాలలో వినివుంటాడు. ఆయన వాటిని బాగుగా చదివివుంటాడు. ఈ ఇద్దరు ప్రవక్తల భావోద్రేకాలు భిన్నమయినవి అయినప్పటికి ఆమోసు యొక్క ప్రభావము ఇతనిమీద ఎక్కువగా ఉన్నది. ఆమోసు న్యాయము మీద గట్టిగా మాట్లాడుతుంటే హోషేయ దయాదాక్షిణ్యముల మీద మాట్లాడుతుంటాడు.

అష్యూరీయులు ఉత్తర రాజ్యాలను జయించుటకు ముప్ఫైసంవత్సరాలకు పూర్వం ప్రవచించినది ప్రారంభించు నాటికి హోషేయ పదిహేను సంవత్సరాలకు ముందు తన సేవ ప్రారంభించాడు. సేద్యపు భూమిని గురించి అనేకసార్లు అతను మాట్లాడిన పద్ధతిని బట్టి అతని పూర్వీకులు వ్యవసాయము చేసేవారని నమ్ముతారు. కొందరేమో ప్రతిఫలము తీసుకోని ప్రవచనము చెప్పే వంశములో నుండి వచ్చాడని నమ్ముతారు. ప్రవచనములను వ్రాత పూర్వకముగా మనకందించిన కొద్దిమంది ప్రవక్తలలో హోషేయ ఒకడై యున్నాడు.

అయితే అతని మాటలన్నీ దయాపూర్వకముగా నుండెను. ఈ విషయంలో యిర్మియా ఇతని విభేదించాడు. తన విచారకరమైన కుటుంబ జీవితములో కష్టాలుపడటం ఏమిటో అలవాటు చేసుకున్నాడు. అతని భార్య పేరు గోమెరు. విగ్రహారాధన వలన నాశనము అనే పేరు కలది. ఆమె జీవితము కూడా అలానే ఉండినది. వీరికి పుట్టిన మొదటి కుమారునికి యెజ్రయేలు అంటే అతని సొంతము అని సంతోషముగా పేరు పెట్టారు. తర్వాత గోమెరు అతని యెడల విశ్వాసముతో లేదు. అందువలన పుట్టిన అమ్మాయికి లోరూ హోమా అని పేరు పెట్టాడు. (జాలినొందినది) అని భావము. తర్వాత పుట్టిన పిల్లవానికి, లోఅమ్మీ – నాజనము కాదని భావము, అయినను ఆమెను అతను ప్రేమిస్తూనే ఉన్నారు.

ఆమె అతనిని వదలి వేరొకనితో ఉంటున్నప్పటికీ ఆమెను ప్రేమిస్తూనే ఉన్నాడు. ఆమె క్రియలకు ఆమె చాలా భయంకర పరిస్థితులలో ఉన్నప్పుడు కూడా హోషేయ ఆమెను రక్షించాడు. అతని ప్రేమ ఆమె యెడల ఎంతలోతుగా ఉన్నదంటే ఆమె ఓ వ్యభిచార బానిసబ్రతుకులో చిక్కబడి నపుడు ఆమెకు పదిహేను తులాల వెండి, కొంత ధాన్యము ఇచ్చి కొనుక్కోని వచ్చాడు. భయంకరముగా పాడయిన అతని

కుటుంబ జీవితములో అతను దుఃఖపూరితమైన ప్రేమ, క్షమాపణ, ఓర్చు కోవటంలో గల అర్థాన్ని తెలుసుకున్నాడు. గోమెరు అతనిని మోసం చేసి చెడు మార్గాలలోకి పోవటం, ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా ప్రేమకు బదులుగా తిరుగుబాటుతనం చూపించడం, దేవుడు తన దీర్ఘశాంతము తో, ప్రేమతో వారిని కనికరించి, వారి శత్రువులనుండి కాపాడడం ఎటువంటిదో తెలుసుకున్నాడు.

గోమెరును అతను పెండ్లి చేసుకొనినది దేవుని ఆజ్ఞ వలననే! అందువలననే దేవుడు తన ప్రజలు తనను విడిచి వ్యభిచరించినపుడు ఆయన పడిన వేదన హోషేయ తెలుసుకోవటానికి అనుభవమయింది.

హోషేయ యొక్క జీవితం ముగింపు మనకు ఖచ్చితముగా తెలియదు కాని ఉత్తరాది రాజ్య ముఖ్య పట్టణం సమరయలో పాతిపెట్టబడి యుండవచ్చును.

అయితే చరిత్ర మరోవిధముగా చెబుతున్నది. క్రీ.పూ. 720లో అష్షూరురాజైన తిగ్గత్పెసరు ఇశ్రాయేలు పది గోత్రములను అష్షూరుకు తరలించినపుడు హోషేయ కూడా వారిలో ఉండి – అష్షూరులో మరణించినపుడు అతనిని గలిలయ సముద్రము ప్రక్కన ఉన్న సాపిడ్ పట్టణంనకు తీసుకొని వచ్చి పాతిపెట్టారని చెబుతున్నది.

అతని తర్వాత వచ్చిన ప్రవక్తయైన యిర్మియా, యెహెజ్కేలు మీద అతను ప్రభావితము చేశాడు. ఆయన బోధలు యూదులకు అతి పవిత్రములు.

క్రొత్తనిబంధనలో ముప్పయిసార్ల కంటే ఎక్కువగా అతని పేరు ప్రకటించ బడింది. యేసుప్రభువుకు ముందస్తు సూచనగా అతనిని చూపించారు. ప్రవక్తల విగ్రహముల సముదాయములో అతను నిలబడ్డాడు.

# కొడవటికంటి రచనలు

1. మడిమెను పట్టుకొనినవాడు
2. జప్పత్పనేహు
3. ఆసెనతు
4. అపోస్తలుడు
5. బర్నబా
6. తిమోతి
7. నా చిత్తానుసారుడు
8. గుంట నుండి మింటికి
9. విశ్వాసంలో ఓ మెట్టు
10. తోటలోని పనివాడు
11. గోత్రకర్త
12. నా కుటుంబము
13. నా దూత
14. నా కుమారి
15. సువార్తలలోని యేసుకథ
16. అంత్యదినములలోని యదార్థ ప్రవక్త
17. హన్నాకృప సజీవసాక్ష్యాలు
18. ప్రయాణంలో ఓ మజిలి
19. నా స్నేహితుడు

✦ ✦ ✦

20. విశ్వాసంలో మరో మెట్టు
21. యేసుకథ రెండవ భాగం
22. జీవనమంతయు

---

# విజ్ఞప్తి

1960 ప్రాంతంలో వెస్ట్ గోదావరి కోవూరు ప్రాంతము నుంచి ప్రకాశం జిల్లా అద్దంకి మండలం ధర్మవరంలో పొలాలు కొని మాగాణి చేసి త్రిపురాంతకంలో కొంతకాలం నివసించి మరలా స్వగ్రామము వెళ్ళిన శ్రీ జగపతిరావుగారు(కమ్మ కులస్థులు), వారి ఏకైక కుమారుడు రాంబాబు, ఏకైక అల్లుడు బలరామకృష్ణయ్య (రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్) గారల చిరునామా తెలిసినవారు దయతో 'హన్నాకృప'కు తెలియజేయ మనవి.

# సువార్తికుడిగా జాన్ డేవిడ్

**అరుణ్‌కుమార్ కె. మహంతి, డైరెక్టర్, ఎ.ఎం.జి. ఇండియా ఇంటర్నేషనల్**

ఆయన నూతనంగా జన్మించాడు. ఉద్యోగం వదులుకొని సేవలో ప్రవేశించారు. మొదట్లో సి.బి.ఎం.లో కొద్దికాలం క్రీస్తు నామమెరుగని చోట్ల సువార్త ప్రకటింపవలెనని మిక్కిలి ఆశ..." (రోమా 15:21) గలవాడై, గ్రామగ్రామాన తిరుగుతూ సువార్త ప్రకటిస్తూ ఉండేవాడు. ఆ రోజుల్లో ఆయన పరిస్థితి దయనీయంగా ఉండేది. నశించిపోతున్న ఆత్మల భారంతో విధవ తల్లి పోషణభారంతో ఆయన కృంగిపోతుండే వారు. అయినా సువార్త సేవలో ఏనాడూ వెనుకంజవేయలేదు. కాలికి చెప్పుల్లేకపోయినా, బస్సుకి డబ్బుల్లేకపోయినా, శోధన లెదురైనా సేవ ఆగేది కాదు. ఒకసారి ఆయన నూజివీడులో సువార్త ప్రకటిస్తుండగా స్థానిక పెద్దలు అడ్డుకొని ఈయనను చెట్టుకు కట్టివేశారు. అక్కడి క్రైస్తవ పెద్దలు కలుగజేసుకొని వారికి నచ్చజెప్పడంతో మరుసటిరోజు ఉదయం కట్లు విప్పి పోనిచ్చారు. ఇలా తిరుగుతూ చీరాలలో ఆయనకు పరియస్థులైన సాలీల కులస్థుల వద్ద కొంతకాలం ఉండి, పొరుగునే ఉన్న స్టూవర్టు పురంలో సువార్త ప్రకటించారు. స్టూవర్టుపురం గజదొంగల సెటిల్మెంటు గ్రామమైనప్పటికి ఆయన నిర్భయంగా సువార్త ప్రకటించి అనేక ఆత్మల్ని సంపాదించాడు.

గుంటూరు జిల్లా చిలకలూరుపేటలో సత్యవేదం అనే దైవభక్తి గల యువతి ఉండేది. ఆ గ్రామంలో చర్చిలేకపోవడం వలన ఆమె తన ఆస్పత్రి వసారాలో చిన్న ప్రార్థనాకూటమి నడుపుతుండేవారు. సంఘాలపై విదేశీమిషనరీల ప్రభావం అధికంగా ఉండేది. స్త్రీలు వాక్యం చెప్పకూడదనే నిబంధన వల్ల వారు ప్రతివారం ఒక సేవకుని పిలచి ఆయనతో ప్రసంగం చేయించేవారు. సత్యవేదంగారి దైవభక్తినిబట్టి ఆమె తల్లి రక్షణలోకి నడిపించబడి మరల బాప్తీస్మం తీసుకున్నారు. ఆ రోజుల్లో సువార్త నిమిత్తమై ఆ గ్రామానికి వచ్చిన జాన్‌డేవిడ్ గారు ఆ కూడికలో ప్రసంగం చేస్తూ ఉండేవారు. ఆ గ్రామంలోనే బొగ్గవరపు బాపనయ్యగారనే ధనిక కమ్మ ఆసామి దీర్ఘవ్యాధితో బాధపడుతూ ఉండేవారు. వారు డా॥సత్యవేదంగారి వద్ద చికిత్సకొరకు వెళ్తుండగా ఆమెద్వారా సువార్తను విని ప్రభువును అంగీక రించారు. మొదటి నుండి రోగుల పట్ల, అనాథులపట్ల ప్రత్యేకమైన ప్రేమ కలిగిన జాన్‌డేవిడ్ గారు ఆయనను కలుసుకొని ఆయన కొరకు ప్రార్థన చేసేవారు. జాన్‌డేవిడ్ గారి భక్తి, అంకిత భావాలకు ముగ్ధులైన బాపనయ్య గారు, ఆయన భార్య వీరమ్మ గారు ఆయనను ఆదరించి ఆశ్రయమిచ్చారు. తరువాత వారే పెళ్ళి పెద్దలుగా వ్యవహరించి జాన్‌డేవిడ్ గారికి, సత్యవేదం గారితో పెళ్ళి కుదిర్చారు. 3-11-55న వీరి వివాహం జరిగింది. సత్యవేదంగారు తన ఆస్పత్రి ఆవరణలో కొద్దిభాగాన్ని తాటాకు లతో కప్పి మందిరాన్ని ఏర్పాటుచేశారు. క్రమేపి సంఘం విస్తరించింది. తరువాత సంవత్సరంలోనే మామగారు మరణించ డంతో జాన్‌డేవిడ్ గారు ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగా స్థిరపడ్డారు.

దైవసేవ - బోధన, స్వస్థత, పోషణ అనే మూడు విధాలుగా చెయ్యవచ్చు. పేదల పట్ల క్రీస్తు ప్రేమ, సువార్త చేరని మారుమూల ప్రదేశాలలో సువార్తను ఉచితంగా ప్రకటించాలనే పౌలు తపన, జాన్‌డేవిడ్ గారిని విపరీతంగా ఆకర్షించాయి. సువార్తను ప్రకటిస్తూనే 1966లో పేదపిల్లలకు ఉచితంగా విద్య బోధించడానికి ఒక పాఠశాలను ప్రారంభించారు. సువార్తకు అవసరమైన కరపత్రాలను అచ్చువేయడానికి ఒక ప్రింటింగ్ ప్రెస్‌ను కొన్నారు. ఆ రోజుల్లోనే అమెరికాలో జరిగే ఒక అంతర్జాతీయ మహాసభలో పాల్గొనే అవకాశం వచ్చింది. అమెరికాలో ఆయనకు ప్రపంచ ప్రఖ్యాత బోధకుడు, డా॥ స్పిరోస్ జోడియాటిస్ గారితో పరిచయం ఏర్పడింది. ఆయన ఎ.ఎం.జి. ఇంటర్నేషనల్ సంస్థకు అధ్యక్షుడు. భారతదేశంలో పత్రికల ద్వారా సువార్తను ప్రకటించే బాధ్యతను స్పిరోస్ గారి కోరిక మేరకు జాన్‌డేవిడ్ గారు సంతోషంగా అంగీకరించారు. అంతకుముందే డా॥ బెల్ ప్రోత్సాహంతో సువార్త సేవ, కుష్ఠువ్యాధిగ్రస్తుల పునరావాస కార్యక్రమాలు బ్ర.జాన్‌డేవిడ్‌గారి సారథ్యంలో జరుగుతూవుండేవి.

పత్రికా సువార్త సేవతో ప్రారంభమైన తన పనిని సంస్థాగతం చేస్తూ దానికి ఎ.ఎం.జి. ఇండియా ఇంటర్నేషన్‌ల్ అని నామకరణం చేశారు. అయితే, ఇది అమెరికాలో ఉన్న ఎ.ఎం.జి. ఇంటర్నేషనల్‌కు శాఖ కాదు. స్పిరోస్ గారితో ఏర్పడిన గాఢమైత్రి కారణంగా ఆయన సంస్థపేరును అరువు తెచ్చుకున్నారే తప్ప, ఈ సంస్థ ఏ విదేశీ సంస్థకు శాఖ మాత్రం కాదు. ఇది

పూర్తి స్వదేశీ, స్వతంత్ర సంస్థ. నగరాలలో, పట్టణాల్లో సువార్త ప్రకటనకు పెద్దగా ఆటంకాలు ఉండవు. అనేకమంది సువార్తికులు ఉంటారు. అనేక అవకాశాలు ఉంటాయి. కాని గ్రామాలలో సువార్త ప్రకటనకు, కులం – పెద్ద అడ్డుగోడగా నిలుస్తుంది. కాబట్టి ప్రేమ ద్వారా మాత్రమే సువార్తను ప్రకటించాలని జాన్‌డేవిడ్ గారి అభిప్రాయం. అనాధలు, అభాగ్యులు పట్ల మనం చూపించే ప్రేమలోనే వారు క్రీస్తును చూడగలుగుతారని ఆయన నమ్మకం. ఈనాటికీ, ఆ నమ్మకం లోనే ఆ పద్ధతిలోనే ఎ.ఎం.జి. సంస్థ విస్తరిస్తోంది.

తన సామాజిక కార్యక్రమాలు, తన సువార్త సేవను మరుగున పడవేయకుండా ఉండే నిమిత్తం, ఎ.ఎం.జి. సంస్థకు తన అల్లుడికి అప్పగించి, తను పూర్తి సమయాన్ని సువార్తకు వినియోగిస్తూ, తన పరుగును తుదముట్టించవలెనని ఆయన తిరిగి సువార్తసేవకు సంపూర్ణంగా అంకితమయ్యారు. అందులో నుండి పుట్టినవే "సువార్త దినోత్సవ వేడుకలు". ఆయన పుట్టిన రోజును అందరూ ఆర్భాటముగా చేస్తూ ఉంటే, మహిమ దేవునికి మాత్రమే చెందాలి అనే ఆశయంతో, తన జన్మదినాన్ని సువార్త కూడికలుగా ఆచరించే సాంప్రదాయాన్ని ఏర్పాటుచేశారు. ఇది ఏటేటా అభివృద్ధిచెందాలని, ఆయన డెబ్భై తొమ్మిదవ సంవత్స రంలో ప్రవేశిస్తున్న ఈ సందర్భంగా మనం ప్రార్థించుదాం!

## పుస్తక పరిచయం :–

సువార్తను ప్రకటించడం ప్రతి విశ్వాసి బాధ్యత. వారిలో కొందర్ని దేవుడినాయకులుగా పేరుపెట్టి పిలుచు కుంటారు. పాతనిబంధన కాలంలో రాజులు, న్యాయాధిపతులు, ప్రవక్తలు ఉండేవారు. దైవోక్తిని ప్రజలకు వినిపించేవారు. దేవుని ఆలోచనలను మనుష్యులకు అర్థమయ్యే రీతిలో వివరించేవారు. క్రొత్తనిబంధన కాలంలో ఈ బాధ్యత దేవుని రాయబారులైన సువార్తికులకు ఇవ్వబడింది. సువార్తికుడైన జాన్‌డేవిడ్‌గారు దేవుడు ఏర్పరుచుకున్న రాయబారి. తన బాధ్యత మేరకు ఆయన అనేకమంది జీవితాలలో పెనుమార్పు రప్పించి యేసుక్రీస్తు పాదాల వద్దకు నడిపించారు. ఆయన సువార్త సేవలో లక్షలాది మంది ప్రభువు నంగీకరించారు. మనసా, వాచా, కర్మణా దేవుని బిడ్డలయ్యారు. గత ముప్పై ఆరు సంవత్సరాలుగా జాన్‌డేవిడ్‌గారు చేస్తున్న సామాజిక సేవలను బట్టి అనేకులు ఆయనకు సంఘ సేవకునిగా గుర్తింపునిచ్చారు. కానీ అది సత్యంకాదు. ప్రాధమికంగా ఆయన సువార్తికుడు. సువార్త సేవలో సమాజ సేవ ఒక శాఖ మాత్రమే. సామాజిక సేవ నిరుపేదలకు మాత్రమే. కానీ సువార్తసేవ పేదలకే కాక ధనికులకు కూడాను. ఆర్థికంగా వెనుకబడ్డ వారికే కాక ఆస్థులు ఉన్నవారికి కూడాను. అందుకే ఈ పుస్తకం. ఆయన చేసిన (చేస్తున్న) విస్తారమైన సేవకు వ్రాతలో చరిత్ర లేకుండా పోతుంది గనుక ఈ పుస్తకం అవసరమైంది. ఈ పుస్తకంలో ఆయనచేసిన వివిధ రకాల సేవను క్రోడీకరించి గ్రంధస్థం చేస్తున్నాం. అక్టోబరు 17,2004 నాటికి ఆయన వయస్సు డెబ్భై ఎనిమిది సంవత్సరాలు నిండుతుంది. ఇందులో దాదాపు యాభై ఎనిమిది సంవత్సరాలు ఆయన సువార్త జీవితం ఉంది. ఒక అర్థ శతాబ్దం పాటు ఆయన చేసిన సువార్త సేవకు ఈ పుస్తకం అర్ధం పడుతుంది.

వీరి సువార్త సేవ ద్వారా లక్షలాది ప్రజలు యేసు ప్రభువును తన సొంత రక్షకునిగా అంగీకరించి తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు. వారిలో విద్యాసంపన్నులున్నారు. సాంఘికంగా ఉన్నత పదవులను అలంగీకరించినవారున్నారు. డాక్టర్లు, ఇంజనీర్లు, ప్రొఫెసర్లు, పోలీస్ ఆఫీసర్లు, రైల్వే ఆఫీసర్లు, లెక్చరర్లు, ప్రిన్సిపాల్స్, టీచర్స్, సాంకేతిక నిపుణులు, వ్యాపార వేత్తలు, పారిశ్రామిక వేత్తలు. ఆయన సువార్త సేవ సమాజంలో అట్టడుగునపడిన ఎందరినో తాకింది. వారిలో కుష్టువ్యాధి గ్రస్తులున్నారు. పోలియో బారినపడ్డ వికలాంగులు, అంధత్వంతో పుట్టిన వికలాంగులు, చెవిటి, మూగవారున్నారు. అనాధులు, జాలరులు, కూలీలు ప్రత్యేకించి రాళ్ళు పగులగొట్టే కూలీలు, కొండజాతివారు, వేశ్యలు, దిక్కుమాలినవారు, వృద్ధులు, పొలాలలో పనిచేసేవారు, సినిమానటులు! ఇలా పేదలు, ధనికులు అందరినీ స్పృశిస్తూ వెళ్తుంది జాన్‌డేవిడ్ గారి సువార్త.

ఆయన వద్దకు వచ్చిన వారెవ్వరూ సువార్త వినకుండా పోలేదు. ఆయన సువార్త ప్రకటించే తీరు ఏ పరమత ఛాందసులకైనా మనసు నొప్పించే రీతిలో ఉండదు. ఆయన పాపుల పట్ల క్రీస్తుకు గల ప్రేమను, పేదల పట్ల క్రీస్తుకు గల దయాదాక్షిణ్యాల గురించే ప్రతి నిత్యం మాట్లాడుతూ ఉంటారు. జాన్‌డేవిడ్‌గారు చేసిన సువార్తకు చరిత్రగా తయారైన ఈ పుస్తకం భావి తరాలలో అనేకులకు కనువిప్పుగా ఉండి సువార్త సేవా త్రోవలో నడిపిస్తుందని ఆశిస్తున్నాము.



!

# బీదలను కటాక్షించువాడు ధన్యుడు

2

**శ్రీ బొకినాల ఇశ్రాయేలు - వారి సహచరులు**

దేవుని ఆజ్ఞలను శిరసావహించాలి!! ఇది క్రైస్తవు లందరి యొక్క ప్రధాన బాధ్యతయైయున్నది. అయితే ఏది చేసినను దేవుని మహిమ కొరకు మాత్రమే చేయాలి (1 కొరింథి 10:31) సుమా! కాబట్టి ముందుగా -

**ఎ) నేడు బీదల (.....) విషయంలో సమాజము యొక్క దృక్పథం ఎట్లుంటున్నదో మరియు సమాజంలో బీదల (.....) యొక్క జీవనస్థితి ఏ విధంగా ఉన్నదో దేవుని వాక్యానుసారంగా తెలుసుకుందాం :**

1. సహోదరుడైనను, సహోదరియైనను దిగంబరులై ఆనాటికి భోజనము లేకయున్నపుడు మీలో ఎవడైనను శరీరమునకు కావలసిన వాటిని ఇయ్యక - సమాధానముగా వెళ్ళుడి, చలికాచుకొనుడి, తృప్తిపొందుడని చెప్పినయెడల ఏమి ప్రయోజనము? (యాకోబు 2:15,16)

2. దరిద్రుడు తన పొరుగువానికి అసహ్యుడు (సామెతలు 14:20)

3. జ్ఞానము గల బీదవాడుండి తన జ్ఞానము చేత ఆ పట్టణమును రక్షించెను. అయినను ఆ బీదవానిని జ్ఞాపకముంచు కొనలేదు. బీదవారి జ్ఞానము తృణీకరించబడును. వారి మాటలు ఎవరు లక్ష్యము చేయరు. (ప్రసంగి 9:15,16)

4. బంగారు ఉంగరము పెట్టుకొని ప్రశస్త వస్త్రములు ధరించుకొనిన యొకడు మీ సమాజ మందిరములోనికి వచ్చినపుడు, మురికి బట్టలు కట్టుకొనిన దరిద్రుడు లోపలికి వచ్చిన యెడల మీరు ప్రశస్త వస్త్రములు ధరించుకొనినవానిని చూచి సన్మానించి - నీవిక్కడ మంచి స్థలమందు కూర్చుండుము అని చెప్పి, ఆ దరిద్రునితో - నీవిక్కడ నిలువుము, లేక ఇక్కడ నా పాద పీఠమునకు దిగువను కూర్చుండమని చెప్పిన యెడల మీ మనస్సులో బేధములు పెట్టుకుని మీరు దురాలోచనతో విమర్శ చేసిన వారగుదురు కారా? నా ప్రియ సహోదరులారా, ఆలకించుడి... మీరు దరిద్రులను అవమానపరచుదురు. (యాకోబు 2:2 - 6)

5. దరిద్రుడు బ్రతిమాలి మనవి చేసుకొనును (సామెతలు 18:23)

6. దరిద్రుడు తన స్నేహితులను పోగొట్టుకొనును (సామెతలు 19:4)

7. దీనులను, దరిద్రులను పడద్రోయుటకై భక్తిహీనులు కత్తిదూసియున్నారు. విల్లెక్కు పెట్టియున్నారు... (కీర్తనలు 37:14)

పై వాక్యాలను బట్టి చూడగా నేటి సమాజంలో బీదల (.....) స్థితి చాలా అవమానకరంగానూ, అపాయకరంగానూ ఉంది.

**బి) అయితే, బీదల (.....) యెడల దేవుని యొక్క దృక్పథం ఎట్లున్నదో దేవుని వాక్యానుసారంగా తెలుసుకుందాం:**

1. దేవుడు బీదల (.....) మొఱను, ప్రార్థనను ఆలకిస్తారు:

కీర్తనలు 69:33లోను 102:17లోను దేవుని వాక్యము ఈవిధంగా తెలియచేయుచున్నది - యెహోవా దరిద్రుల మొఱ ఆలకించును. ఆయన దిక్కులేని దరిద్రుల ప్రార్థన నిరాకరింపక వారి ప్రార్థనవైపు తిరిగియున్నాడు.

2. దేవుడు బీదలను (.....) విడిపిస్తారు :

కీర్తనలు 72:12లో దేవుని వాక్యము ఈ విధంగా తెలియచేయుచున్నది - దరిద్రులు మొఱపెట్టగా అతడు (దేవుడు) వారిని విడిపించును. దీనులను, నిరాధారులను అతడు (దేవుడు) విడిపించును.

3. దేవుడు బీదలను (.....) కనికరిస్తారు :

కీర్తనలు 72:13లో దేవుని వాక్యము ఈ విధంగా తెలియజేయుచున్నది - నిరుపేదలయందును, బీదలయందును అతడు (దేవుడు) కనికరించును.

4. దేవుడు బీదల (.....) ప్రాణాలను రక్షిస్తారు :

కీర్తనలు 72:13,14లోను, 12:7లోను దేవుని వాక్యము ఈ విధంగా తెలియచేయుచున్నది - బీదల ప్రాణములను అతడు (దేవుడు) రక్షించును. కపట బలత్కారము నుండి అతడు (దేవుడు) వారి ప్రాణమును విమోచించును.

వారి ప్రాణము అతని దృష్టికి (దేవుని దృష్టికి) ప్రియముగా ఉండును. యెహోవా నీవు దరిద్రులను కాపాడెదవు.

ఈ తరము వారి చేతిలో నుండి వారిని నిత్యము రక్షించెదవు.

5. దేవుడు బీదల (.....) పిల్లలను రక్షిస్తారు :

కీర్తనలు 72:4లో దేవుని వాక్యము ఈ విధంగా తెలియచేయుచున్నది - బీదల పిల్లలను రక్షించి బాధపెట్టు వారిని నలుగగొట్టును.

6. దేవుడు బీదలకు (.....) శరణ్యముగా ఉంటారు :

యెషయా 25:3లో దేవుని వాక్యము ఈవిధంగా తెలియజేయుచున్నది – భీకరుల ఊపిరి గోడకుతగిలిన గాలివాన వలె ఉండగా నీవు బీదలకు శరణ్యముగా ఉంటివి. దరిద్రులకు కలిగిన శ్రమలో వారికి శరణ్యముగాను, గాలివాన తగులకుండా ఆశ్రయముగాను, వెట్ట తగులకుండా నీడగాను ఉంటివి.

7. దేవుడు బీదలను (.....) లేవనెత్తి హెచ్చిస్తారు :

కీర్తనలు 113:7,8లో దేవుని వాక్యము ఈవిధంగా తెలియచేయుచున్నది – ప్రధానులతో తన ప్రజల ప్రధానులతో వారిని కూర్చుండబెట్టుటకై ఆయన నేలనుండి దరిద్రులను లేవనెత్తువాడు. పెంటకుప్ప మీద నుండి బీదలను పైకెత్తువాడు.

8. దేవుడు బీదలను (.....) ఆహారముతో తృప్తిపరుస్తారు:

కీర్తనలు 132:15లో దేవుని వాక్యము ఈవిధంగా తెలియజేయుచున్నది – బీదలను ఆహారముతో తృప్తిపరచెదను.

9. దేవుడు బీదలను (.....) విమర్శకుల చేతిలో నుండి రక్షిస్తారు :

కీర్తనలు 109:31లో దేవుని వాక్యము ఈవిధంగా తెలియజేయుచున్నది - దరిద్రుని ప్రాణమును విమర్శకు లోపరచువారి చేతిలోనుండి అతని రక్షించుటకై యెహోవా అతని కుడిప్రక్కన నిలుచుచున్నాడు.

10. దేవుడు బీదల (.....) తరపున వ్యాజ్యమాడి న్యాయము తీరుస్తారు :

కీర్తనలు 140:12లో దేవుని వాక్యము ఈవిధంగా తెలియచేయుచున్నది – బాధింపబడువారి పక్షమున యెహోవా వ్యాజ్యమాడుననియు దరిద్రులకు ఆయన న్యాయము తీర్చు ననియు నేనెరుగుదును.

11. దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తు వారి కృప ద్వారా బీదలను (.....) ధనవంతులనుగా చేస్తారు :

2కొరింథి 8:9లో దేవుని వాక్యము ఈ విధంగా తెలియచేయుచున్నది – మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదునుగదా? ఆయన ధనవంతుడైయుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను.

పై వాక్యాలను బట్టి చూడగా దేవుడు బీదల (.....) పట్ల ఎంతో దయ కల్గియున్నారు. బీదరికాన్ని రూపుమాపి వారిని ధనవంతులుగా చేయనుద్దేశించుచున్నారు.

**సి) మరైతే, సమాజంలో బీదలపట్ల (.....) క్రైస్తవుల యొక్క దృక్పథం ఎట్లుండాలో దేవుని వాక్యానుసారంగా తెలుసుకుందాం:**

1. 1తిమోతి 6:17-19లో దేవుని వాక్యం ఈవిధంగా ఆజ్ఞాపించుచున్నది : ఇహమందు ధనవంతులైనవారు గర్విష్ఠులు కాక, అస్థిరమైన ధనమునందు నమ్మికయుంచక, సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనకు ధారాళముగా దయచేయు దేవునియందే నమ్మికయుంచుడని ఆజ్ఞాపించుము. వారు వాస్తవమైన జీవమును సంపాదించుకొను నిమిత్తము రాబోవు కాలమునకు మంచి పునాది తమ కొరకు వేసుకొనుచూ, మేలు చేయువారును, సత్క్రియలు అను ధనము గలవారును, ఔదార్యము గలవారును, తమ ధనములో ఇతరులకు పాలిచ్చు వారునైయుండవలెనని వారికి ఆజ్ఞాపించుము.

2. యోబు 31:16-21లోదేవుని వాక్యం ఈ విధంగా తెలియచేయుచున్నది - బీదలు ఇచ్ఛయించిన దానిని నేను బిగబట్టిన యెడలను... ఎవడైనను వస్త్రహీనుడై వచ్చుట నేను చూడగను, బీదలకు వస్త్రము లేకపోవుట నేను చూడగను... నా బుజశల్యము దాని గూటి నుండి పడనుగాక! నా బాహువు ఎముకలోనికి విరుగును గాక!

పై వాక్యాలను బట్టి చూడగా దేవునియందు, దేవుని వాక్యమునందు భయభక్తులు కలిగిన ఇహలోక ధనవంతులైన క్రైస్తవులు తప్పనిసరిగా తమ ధనములో ఇతరులకు పాలిచ్చు వారైయుండాలనియు, మరియు దేవుని యెదుట నమ్మకమైన వానిగా వర్ధిల్లిన యోబు అనే భక్తిపరుడు బీదల (.....) పట్ల కలిగియుండిన దృక్పథమే క్రైస్తవులందరూ కలిగియుండవలసి యున్నదని తెలియుచున్నది.

# బిషప్ డా॥ మూర్తోడి సంపత్ శాంతవర్ధన్

ఒంగోలులో కర్నూలు రోడ్డులో చాలాదూరంలో ఓ మిద్దె. ఆ మిద్దె యజమాని కొండారెడ్డి. ఆర్.టి.సి.లో మేస్త్రీగా ఉంటూ ప్రస్తుతం కోటిరూపాయల ఖరీదు చేసే బిల్డింగులు కట్టించి, అద్దెకు ఇచ్చి, చిన్న బంకులో కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. పెద్ద కుమార్తె రాజేశ్వరి కూడా తండ్రికి సహాయంగా ఉండినది. ఆ అమ్మాయికి దగ్గరలో హాస్పిటల్‌లో పనిచేస్తున్న కాంపౌండర్‌తో వివాహము చేశారు. వివాహము అయిన తర్వాత అత్తగారింటికి వెళ్ళి ప్రక్కింటిలో మామిడిచెట్టు ఎక్కి మామిడికాయ కోయబోయి క్రింద పడిపోయింది. లావాటి పిల్ల. వెన్నెముక విరిగింది. ఎన్ని హాస్పిటల్స్‌కు తిరిగినా, చెన్నై వరకు తిరిగినా కానీ నడుము క్రింద స్పర్శ రాలేదు.

ఎవరో యేసుప్రభువును నమ్ముకొంటే స్వస్థత కలుగుతుందని చెబితే యేసుప్రభువును నమ్ముకొని ఓ సంవత్సరం పాటు చర్చీలకు అందరూ వెళ్ళేవారు కాని, ఆ అమ్మాయికి స్వస్థత రానందున అందరు ఒకరి తర్వాత ఒకరు యేసును వదిలేశారు. కాని తండ్రి, రాజేశ్వరి ఇద్దరు యేసును హృదయపూర్వకముగా ఆరాధించేవారు.

ఈ సంగతి తెలిసిన వ్యక్తి నాకు చెబితే - కొండారెడ్డి గారిని కలిసి విషయము తెలుసుకొని రాజేశ్వరి దగ్గరకు నెలకు ఒకసారి వెళ్ళి వాక్యము చెప్పి ప్రార్ధన చేసి పుస్తకాలు ఇస్తుండేవాడ్ని. అలా ఓ సంవత్సరం రాజేశ్వరి విశ్వాసంలో లోతుగా ఎదిగినది. తర్వాత మూడు నాలుగు నెలలు రాజేశ్వరిని దర్శించలేదు. తర్వాత వెళ్తే రాజేశ్వరి ఈ నాలుగు నెలలలో తన అనుభవాలు చెప్పి భోరున ఏడ్చింది.

ఈ మధ్య కాలంలో హెలికాప్టరులో సేవచేసే ఓ సువార్తికుడు ఒంగోలులో మీటింగులు పెట్టాడని, స్వస్థతల గురించి గొప్పగా చాటింపు వేయించాడని, ఈ సంగతి తెలిసిన కొండారెడ్డి మరియు ఇంకా నలుగురు కలసి మంచం మీద రాజేశ్వరిని మోసుకుంటూ మూడు కిలోమీటర్ల దూరంలో వున్న మీటింగు జరిగే స్థలానికి తీసుకొనివెళ్ళారు. కాని ఆ సువార్తికుని ఇంటర్వ్యూ దొరకలేదు.

మూడవనాడు ముగింపులో ఎలాగయినా ఆయనతో ప్రార్థన చేయించాలని మంచం మోసుకుంటూ ఆ సువార్తికుని కారు దగ్గరకు తీసుకొని వెళ్తే ఆయన కారు కిటికీలోనుండి తలమీద చెయ్యి పెట్టి వెళ్ళిపోయాడు. ఈ సంగతి చూసిన అన్యులు ఆ సువార్తికుడినే కాకుండా యేసునామాన్ని కూడా దూషించారు అని చెప్పి 'సువార్త ప్రకటించేవారు ప్రకటించకుండా స్వస్థతలు అని గొప్పగా చెప్పి ప్రజలను మోసము చెయ్యడం ఎందుకు? యేసు నామము దూషించబడడం ఎందుకు?' అని ఏడ్చింది. నాకు ఈ విషయము చాలా మనస్థాపము కలిగించింది.

ఆ రోజు టి.వి.లో సువార్త ఛానల్‌లు లేవు. ప్రతి సోమవారం ఉదయం గుంటూరు ఎల్‌షద్దాయ్ చర్చి నుండి శాంతవర్ధన్‌గారి వాక్యము వినేవాడ్ని. మంగళవారం కడపనుండి ఓ సువార్తికుని వాక్యం వినేవాడ్ని.

ఓసారి కడప వెళ్ళి ఆ సువార్తికుని చూడాలని వారి ఇంటికి వెళ్ళాను. అదే సమయానికి వీధిలో అడుక్కొనే వ్యక్తి చింపిరి గుడ్డలతో నిలుచుని ఉన్నాడు. సువార్తికుడు బయట నిలుచుని ఉన్నాడు.

'మీ వాక్యము వింటుంటానండి. కడపలో నా పత్రిక పాఠకులను కలుసుకోవడానికి వచ్చాను. మిమ్మల్ని చూడాలని వచ్చాను' అన్నాను. ఆ సువార్తికుడు నవ్వి ప్రక్కనున్న భిక్షగాడిని చూపించి 'ఇతనితో కలిసి పని చేస్తున్నారా?' అన్నాడు. టి.వి.లో చక్కని వాక్యము బోధించే ఇతని హృదయంలో ఇంత దుర్మార్గత ఉంటుందా? అనిపించి మారుమాట్లాడకుండా వచ్చేశాను.

ఇప్పుడు గుంటూరునుండి టి.వి.లో మాట్లాడే శాంతవర్ధన్‌గారు ఎక్కువగా స్వస్థత గురించి మాట్లాడుతుంటారు. కాబట్టి రాజేశ్వరికి జరిగిన బాధాకరమైన సన్నివేశము శాంతవర్ధన్‌గారితో మాట్లాడాలని రూపాయి

బిల్ల ఫోనులో నుండి శాంతవర్ధన్ గారికి ఫోన్‌చేసి – అంతకు ముందు శాంతవర్ధన్‌గారిని ఎన్నడు చూచి ఉండలేదు. 'సార్! నేను ఒంగోలు నుండి మాట్లాడుతున్నాను. స్వస్థతలను గురించి మీతో కొన్ని సందేహాలను తీర్చుకోవడానికి మీరు పర్మిషన్ ఇస్తారా?' అని అడిగాను.'రేపు ఉదయం గుంటూరు రండి' అన్నాడు. 'ఎన్ని గంటలకు రమ్మంటారు?' అన్నాను. 'పదిగంటలకు రండి' అన్నారు శాంతవర్ధన్‌గారు. మరునాడు ఉదయం ఐదు గంటలకు ఒంగోలులో శబరి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి రెండున్నర గంటలకు గుంటూరు రైల్వేస్టేషన్‌లో నుండి బయటకు వచ్చి రూపాయి బిల్ల ఫోనులో శాంతవర్ధన్ గారికి ఫోన్‌చేశాను.

'నేను పది గంటలకు రమ్మంటే మీరు ఇప్పుడు వచ్చారే!' అన్నారు. నేను కొంచెం ఫీలయ్యాను. 'అది కాదుసార్! మీ ఇల్లు ఎక్కడ?' అన్నాను.

'మెడికల్ కాలేజీమీదుగా వస్తే చివరిలో ఉంటుంది' అన్నారు. పది గంటలకు శాంతవర్ధన్‌గారి ఇంటికి వచ్చి కార్డు పంపించాను. పదిన్నరకు లోపలికి రమ్మన్నారు.

'బ్రదర్! పనిమీదవున్నాను, పదిహేను నిమిషాలలో ముగించుదాము' అన్నారు శాంతవర్ధన్‌గారు.

'అలాగే సార్!' అని కూర్చొని మాట్లాడడం మొదలు పెట్టాను. శాంతవర్ధన్‌గారు నా సందేహాలన్నిటికి సరైన విధంగా సమాధానం చెప్పారు. 'మీరు ప్రార్థించండి' అన్నారు.

నేను మోకరించి ప్రార్థించాను. శాంతవర్ధన్‌గారు లోనికి వెళ్ళి స్వయముగా డ్రింకు ఒక గ్లాసులో తెచ్చి నాకు ఇచ్చి, ఒక కవరు ఇచ్చారు.

నేను తృప్తిగా బయటకు వచ్చి కవరులో చూస్తే వెయ్యి రూపాయలు ఉన్నాయి. ఆ విధంగా గుంటూరు శాంతవర్ధన్‌గారితో పరిచయము పెరిగింది.

శాంతవర్ధన్‌గారి సాక్ష్యము హన్నాకృపలో ధారా వాహికముగా ప్రచురించటం ప్రారంభించిన తర్వాత ప్రతి నెల ఒకసారి వారి ఇంటికి వెళ్ళి, వారు చెబుతుంటే ఏ నెల కానెలే సాక్ష్యము వ్రాసుకొని ఒంగోలు వచ్చేవాడిని. ఓ నెలలో సాక్ష్యము వ్రాసుకొని వచ్చిన తర్వాత మూడు రోజులకు మరలా శాంతవర్ధన్‌గారు ఫోన్ చేసి వెంటనే గుంటూరు రమ్మన్నారు. నేను ఉన్నఫలంగా బయలుదేరి గుంటూరు వెళ్ళాను.

'మీరు నాలుగు నెలల క్రితం మీ రచనలు నాకు కొన్ని ఇచ్చారు. కాని నేను వాటిని లెక్కచెయ్యలేదు. అన్ని పుస్తకాలవంటివే కదా! అని ఆ ప్రక్కన పెట్టాను. రెండు రోజులక్రితం ఏమి తోచక 'ఆసెనతు'ను చదవటం మొదలుపెట్టిన తర్వాత ఇక పూర్తి చెయ్యకుండ ఆపలేదు.

నాకు చాలాకాలంగా ఓ కోరిక బలంగా ఉంది. అదేమంటే 'క్రైస్తవ సినిమా' తీయాలని. ఇప్పుడు ఆసెనతును నేను చదివిన తర్వాత నా భార్య చదివింది. దీనిని సినిమా తీస్తాను. ఏమంటారు రచయితగారూ?' అన్నాడు నవ్వుతూ.

'మంచిదే సార్! సినిమా తీయండి. కానీ డైలాగులు నేనే వ్రాయాలి' అన్నాను. అప్పుడు ఆసెనతును సినిమాగా తీసినంత సంతోషపడిపోయారు శాంతవర్ధన్‌గారు. తరువాత నెలలో సాక్ష్యము వ్రాసుకోవడానికి గుంటూరు వెళ్తే 'నేను అమెరికా వెళ్తున్నాను, తిరిగి రావడానికి మూడు నెలలు పడుతుంది కనుక మూడునెలల సాక్ష్యము వ్రాసుకోండి' అని మధ్యాహ్నం ఒంటిగంటకు మొదలు సాయంకాలం అయిదుగంటల వరకు మూడునెలల సాక్ష్యము వ్రాసు కున్నాను. ప్రతినెల ఇచ్చే వెయ్యి రూపాయలు హన్నా కృప చందాకు బదులుగా మూడువేల రూపాయలు ఇచ్చారు.

ఆగష్టు నెల ఏడవ తారీఖు శాంతవర్ధన్‌గారి గుడ్‌న్యూస్ మెసెంజర్సు నుండి వచ్చిన రెండు బస్తాల కరపత్రాలను ఆఫీసులో నలుగురు పిల్లలతో కలసి నేను మధ్యకు మడుస్తుంటే ఫోన్ వచ్చింది – శాంతవర్ధన్‌గారు.

'నేను ఐ.సి.లో ఉన్నాను' అన్నారు.

'ఆరె! అదేంటి? మీప్రక్కన ఎవరున్నారో వారికి ఇవ్వండి ఫోను' అన్నాను. నిర్మలా శాంతవర్ధన్‌గారు ఫోన్‌లో 'మధ్యాహ్నం ఆదివారం ఆరాధన ముగిసిన తర్వాత గాలి పీల్చటం కష్టమయింది' అన్నారు. వెంటనే సాయంత్రం ఏడు గంటలకు గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఐ.సి.లో శాంతవర్ధన్ గారిని బెడ్‌ప్రక్కన నిలుచున్నాను. తెల్లవారి ఆరు గంటలకు ఐ.సి. నుండి బయటకు వచ్చేటంత

వరకు ప్రక్కనే నిలుచున్నాను. ఇప్పుడు వారికి పూర్తిగా బాగయింది. పెద్దకుమారుడు 'షాలీ' వచ్చాడు. ఇక ఇంటికి వెళ్ళవచ్చునన్నారు అన్నారు.

ఇక నేను ఒంగోలు వెళ్ళవచ్చునని శాంతవర్ధన్ గారి వద్ద సెలవు తీసుకొని ఒంగోలు వచ్చాను. రెండు రోజుల తర్వాత గుంటూరు ఫోనుచేస్తే నిర్మలా శాంతవర్ధన్ గారు ఫోన్ తీసుకొని 'అమరావతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉన్నామ'ని చెప్పారు. మరలా గుంటూరు వెళ్ళాను. సోమవారం లలితా హాస్పిటల్‌నుండి బయటకు వస్తున్నపుడు కుడిపాదముమీద నల్లనిమచ్చను గమనించారు. అది 'గాగరిన్' కనుక పాదము తీసివేయాలన్నారు. కాని శాంతవర్ధన్‌గారు ఒప్పుకోలేదు అని తెలిసింది.

అలా అస్వస్థతకు గురయిన ఆయన అపోలో హైదరాబాద్‌లో కుడి కాలు గిలకకు పైగా తీసివేయబడి, తర్వాత ఎర్రగడ్డ అర్.సి.యమ్. హాస్పిటల్‌లో కొంతకాలం ఉన్నప్పుడు నేను కూడా వారితో కలిసి కొంతకాలం ఉన్నాను. ఆ విధంగా అమెరికా ప్రయాణం కొరకు మూడు నెలలకు వ్రాసుకొనిన వారి సాక్ష్యము హాస్పిటల్‌లో ఉన్నందున ఆ మూడునెలలు హన్నాకృపలో ఆటంకము లేకుండా ప్రచురించబడింది. తర్వాత ఆర్టిఫిషియల్ కాలుతో, మరింత ఆత్మబలంతో ఆయన అనేక పట్టణాలలో, పల్లెలలో, నేను ఏర్పాటుచేసిన అన్ని సువార్త సభలకు హాజరయ్యారు.

నా అనుభవములో ఆయన నన్ను ప్రేమించి నంతగా ఎవరిని ప్రేమించలేదు. టి.వి.లో ఆయన చేసిన ప్రసంగాలలో రెండు మూడుసార్లు నాపేరును పలకరించారు.

ఆయనకు రోజుకు నాలుగువందల కాల్సు వస్తుంటాయి. ఈ అయిదు సంవత్సరాలలో డాక్టరు చనిపోతావని చెప్పిన ముగ్గురిని – శనివార ప్రార్థనా కూటానికి పంపించాను. అందరూ ఆరోగ్యముగాను, సంతో షముగాను ఉన్నారు.

ఒకసారి ఓ సువార్తికుని కుటుంబము గురించి నన్ను అడిగారు. ఆయన కుమార్తె ఫీజు కట్టలేక చదువు మానివేసింది అని చెబితే వెంటనే అమ్మగారిని పిలిచి ఐదు వేలరూపాయల చెక్కు వ్రాసి ఇచ్చారు. నా కుమారుని వివాహమునకు తిరుపతి దగ్గర వెంకటగిరికి వచ్చారు.

నేను పిలిస్తే ఎంత చిన్న కూటమునకైనా వచ్చేవారు.

'ఒకరోజు ఫోనుచేసి 'నా స్నేహితుడు'ని ఏమిచేశావు?' అన్నారు. 'ఏమి చెయ్యలేదు సార్! పదివేలు ఉంటే మొదలుపెట్టవచ్చును' అన్నాను. ఆయన పదివేలు చెక్కు ఇచ్చారు.

అలా ఆయన పర్సులో నుండి కూడా ఎప్పుడూ ఇస్తూనే ఉంటారు. కానీ ఆయన పర్సు ఎప్పుడు సన్నబడ లేదు. ఇచ్చేవారికి దేవుడు ఎన్నడు తరుగుచెయ్యడు.

మొన్న ఆగష్టు నెలాఖరులో గుంటూరు హాస్పిటల్ లో ఉన్నారని తెలిసి వెళ్ళాను. ఆయనను ఇంటికి తీసుకొని వచ్చారు. ఆయనతో కొంచెంసేపు మాట్లాడి ఒంగోలు వచ్చాను. కాని మరలా నేను ఫోను చేస్తే వెంటిలేటరు మీద హైదరాబాదు తీసుకొని వెళ్ళారని తెలిసింది. పదిరోజులు ఆగి హైదరాబాదు అపోలోకి వెళ్ళాను. కాని ఐ.సి.లో ఆయనను చూడనివ్వలేదు.

సెప్టెంబరు 1వ తారీఖున ఒంగోలులో కల్వరి సుధాకర్ ఫోను చేసి 'శాంతవర్ధన్‌గారు ఇకలేరు' అని చెప్పారు. ఆ రాత్రి గుంటూరు వెళ్ళాను. నిశ్చలంగా నిద్రపోతున్నట్లు పండుకొని ఉన్నారు. ఆయన పాటలు వినబడుతున్నాయి.

మూడవ తారీఖు నా భార్యతో కలసి ఉదయం పది గంటలకు వెళ్ళాను. అక్కడనుండి గుంటూరు దగ్గర 'మహిమశాలలో' సమాధి అంటే అక్కడికి వెళ్ళాము. నేలలో కట్టుబడి చేసివున్నది. కొన్ని నెలల క్రితం 'మహిమశాల' ప్రతిష్టిత రోజు ఆయన ఫోన్ చేస్తే వెళ్ళాను. ఇప్పుడు సమాధి కొరకు సిద్ధపరచిన స్థలమునకు ఓ గజం దూరంలో ఆయన కుర్చీలో కూర్చుని నాతో అరగంట మాట్లాడారు.

ఆయన మాటలు, పాటలు, ఆయన నవ్వు, ఎక్కడికిపోయాయి? 'ఆయనవెళ్ళిపోతూ వీటిని మీరేమయినా చేసుకోండి, ఇది నా శరీరము! నేను ప్రభువుతో ఉండడానికి వెళ్తున్నాను' అన్నారు. అవన్నీ మా హృదయంలో పదిలంగా ఉన్నాయి, ఉంటాయి.

క్విజ్ **అక్టోబర్ నెల ప్రశ్నలు** 78

పాఠకులను వాక్యపు జ్ఞానంలో
పెంచటమే
ఈ శీర్షిక ఉద్దేశ్యం.

యిర్మీయా 1 - 10వ అధ్యాయము వరకు

**1. బాధకును, శ్రమకును కారణమేమి?**

**2. పితరులకిచ్చిన దేశములో కాపురముండనిచ్చుటకు యూదా వారు చెయ్యవలసిన - పది కాదు ఐదు పనులేవి?**

## ఈ నెల పోషకులు :

ఆగష్టు 20 నుండి సెప్టెంబర్ 20, 2011 వరకు మాకు చేరినవి.

| | | |
|---|---|---|
| శ్రీమతి కళావతి రాజకుమార్ | చెన్నై | 2000 |
| శ్రీ యడవల్లి ప్రసాదరావు | హైదరాబాదు | 2000 |
| డా॥ ఏబెల్ | చెన్నై | 1500 |
| డా॥ యన్.జయకుమార్ రావు | విశాఖపట్నం(సీతమ్మధార) | 1000 |
| శ్రీమతి కె. విక్టోరియా రుక్మిణి | హైదరాబాద్ | 1000 |
| పాస్టర్ జి.విజయ్‌కుమార్ | హైదరాబాద్ | 1000 |
| బ్రదర్ స్టాలిన్ | మీరజ్ | 1000 |
| శ్రీమతి పద్మా దానియేల్ | హైదరాబాదు | 1000 |
| శ్రీమతి నిర్మలా శాంతవర్ధన్ | గుంటూరు | 1000 |
| శ్రీమతి శారద | ఎర్రుపాళెం | 1000 |
| శ్రీమతి శ్యామల | కొత్తపట్నం, ఒంగోలు | 1000 |
| శ్రీమతి నాగేశ్వరి భాస్కర్ | హైదరాబాద్ | 1000 |
| రెవ. జడ్.సి. దేవదానం | కర్నూలు | 1000 |
| రెవ. కృపానందం | ఈదర | 500 |
| అపోస్తలుడైన ఎబినేజర్ | హైదరాబాద్ | 500 |
| శ్రీ హ్యారీ బెన్నిసన్ | బెంగుళూరు | 500 |
| శ్రీమతి టి. రూతమ్మ | గుంటూరు | 500 |
| శ్రీమతి సుశీల రాజారావ్ | సత్తుపల్లి | 500 |
| పాస్టర్ దేవకుమార్ | సూళ్ళూరుపేట | 200 |
| పాస్టర్ ఎం. బోయజు | ఒంగోలు | 200 |
| శ్రీ జంగాల ఆనందం | ఒంగోలు | 200 |

## సెప్టెంబర్ నెల ప్రశ్నలకు జవాబులు:

1. పరిశుద్ధుడు నిత్యనివాసి నివసించునది పరిశుద్ధ స్థలములోనేనా?

**జవాబు:** కాదు, వినయము దీనమనస్సు గల వారి యొద్ద **(యెషయా 57 : 15)**

2. భూమిని కప్పుటకు చెట్లు ఏలాగో మనుష్యులకు పైబట్ట ఆలాటిదే. వీటిని ఇచ్చు యెహోవా నిజముగా ఇచ్చునది - చెట్లు, పైబట్ట కాదు మరేమిటి?

**జవాబు:** నీతి **(యెషయా 61:3,10)**

**జవాబులు ప్రయత్నించినవారు :**

**శ్రీమతి కొండేటి సులోచనా దేవి (ఒంగోలు)**
**శ్రీమతి పి.యమ్. సుసీలా రాజారావ్ (సత్తుపల్లి)**
**శ్రీమతి టి. క్రిస్టియానమ్మ (నందికొట్కూరు)**
**శ్రీమతి బత్తుల ఆనీమేరి (హైదరాబాదు)**

**ప్రియపాఠకులారా మీరు పంపే కానుక 500రూ. మించినప్పుడే ఆన్‌లైన్‌లో వేయండి.**

పెద్ద కథ

# విశ్వాసంలో మరో మెట్టు 23

సామ్యేలు ప్రక్కనున్న తెలుగు తెలిసిన వ్యక్తి మీరు ముందు సీటు మీద మీ బ్యాగ్ పెట్టి కాళ్ళు చాపుకొని కూర్చుంటే ఆయనకి కోపం వచ్చింది.' రైలు దిగి వెళ్ళేటప్పుడు ఈ స్థలం కూడా మీ వెంట తీసుకొని వెళ్తారా?' అని మిమ్మల్ని అన్నాడు అని చెప్పాడు.

సామ్యేలు వంగి అవతల బ్లాకులో ఆ లావాటి ఆయన కూర్చుని ఎదురుగా ఇద్దరు స్త్రీలతో మాట్లాడటం చూసి పోనీలే! ఆయనకు సీటు దొరికింది అనుకొన్నాడు. కొంచెంసేపటికి కిటికి ప్రక్కన కూర్చుని ఒడిలో సూట్‌కేస్ పెట్టుకొని వ్రాసుకొంటున్నాడు సామ్యేలు.

ఇంతకుముందు తనని గదిమి కోప్పడిన వ్యక్తి వచ్చి సామ్యేలు ఎదురుగా సీటులోకూర్చుని సామ్యేలు రెండు చేతులు తన చేతులలోనికి తీసుకొని మీరు నన్ను క్షమించండి అని ఇంగ్లీషులో చాలా బాధపడుతూ అడిగాడు.

ఎందుకు? అన్నాడు సామ్యేలు.

ఇందాక మీ మీద పరుషంగా మాట్లాడాను అన్నాడు.

దానికేముంది, నాకు మీ భాష తెలియదు కదా! అన్నాడు.

మీకు తెలియకపోయినా ప్రభువుకు తెలుసుకదా! అన్నాడు ఆయన.

ఏ ప్రభువు? అన్నాడు సామ్యేలు.

యేసుప్రభువు అన్నాడు అతను.

సరిగా చెప్పండి, ఏమి జరిగింది? అన్నాడు సామ్యేలు.

మా ఊరిలో ట్రైన్ ఆగదు. అందువలన ఈ ట్రైన్‌లో ప్రయాణం చేసి మళ్ళీ బస్‌లో వెనక్కి మా ఊరు వెళ్ళాలి. నేను, నా మనుమరాలు స్టేషన్‌కి వచ్చేసరికి ఈ బండి బయలుదేర బోతోంది. నేను అవతల పెట్టెలో ఎక్కేటప్పుడు ఈ బ్లూ బ్యాగ్ తగిలించుకొని మీరు ట్రైన్‌లో ప్రవేశిస్తున్నారు. మేమెక్కిన పెట్టె ఇరుకుగా ఉండి ఈ పెట్టెలోకి వస్తే మీరు బ్యాగ్‌ని పెట్టి, కాళ్ళు చాపివున్నారు. నేను ఇక్కడే కూర్చోవాలి అనుకొంటే మీ బ్యాగ్ అడ్డం వచ్చింది. కనుక మీరు బండి దిగి వెళ్ళేటప్పుడు ఈ సీటు కూడా మీ వెంట తీసుకొని వెళ్తారా? అని కోపంగా వెళ్ళి ప్రక్క పోర్షన్‌లో ఖాళీగా ఉంటే అక్కడ కూర్చున్నాను.

నేను అక్కడ కూర్చోవటం దేవుని చిత్తం. అందువలన మీ బ్యాగ్‌ని అక్కడ పెట్టి నాకు సీటు లేకుండా చేశారు అన్నాడు.

మీరు అక్కడ కూర్చోవడం దేవుని చిత్తం ఎలా అయ్యింది? అన్నాడు సామ్యేలు.

అక్కడ నా ఎదురుగా ఇద్దరు ఆడవాళ్ళు కూర్చుని ఉన్నారు. వాళ్ళు ముస్లింలు. వారిలో ఒకామెకి కాన్సర్. డాక్టరు ఇక బ్రతకదు తీసుకెళ్ళమని డిశ్చార్జ్ చేశాడు. నేను వారి ఎదురుగా ఖాళీలో కూర్చుంటే వారిద్దరు మౌనంగా ఏడుస్తున్నారని గ్రహించి అడిగితే వారు విషయం చెప్పారు. అప్పుడు నేను యేసుప్రభువు సిలువ శక్తిని గురించి చెప్పాను. వారిద్దరు విశ్వసించారు. ఆమె స్వస్థత పొందినది. అది నిజం – అన్నాడు.

సామ్యేలు తన సాక్ష్యము ఆయనకు చెప్పి ఆయన అడ్రసు తీసుకున్నాడు. పి.సదాశివన్, జ్యోతినిలయం, మురుకురీమ్ పుజా – త్రివేండ్రం జిల్లా, కేరళ – 695302, ఫోను 0471-2424052 అని చెప్పారు. వాళ్ళ స్టేషన్ వచ్చింది. దిగి వెళ్ళిపోయారు. కాని సామ్యేలు వారికి తెలుగు భాష రాకపోయినా తెలుగు హన్నాకృప నేటి వరకు పంపిస్తూనే ఉన్నాడు.

తర్వాత ఓ సంవత్సరానికి శ్రీమతి ఉమాకుమారి, భర్తపేరు డాక్టరు వి. లక్ష్మణరావు, రోజ్ గార్డెన్ 122, పంగ్‌మడి మెడికల్ కాలేజి, పోస్టు త్రివేండ్రం – 11 నుండి ఫోను సామ్యేలుకు వచ్చింది. ఫోను 914712440815.

లక్ష్మణరావుగారు భారత ప్రభుత్వ అంతరిక్ష పరిశోధనలో ఇంజనీరు. సొంతవూరు ఈస్టుగోదావరి. ఆరునెలల క్రితం జపాన్‌నుండి త్రివేండ్రం వచ్చారు. క్రైస్తవ ఇంగ్లీషు సర్వీసుకు వెళ్తుంటారు. అక్కడ పి. సదాశివన్ కూడా వస్తారు. ఆయన ఇది మీ భాష మ్యాగజైన్ అని ప్రతినెల

ఉమగారికి ఇస్తుండేవారు. ఉమగారు కొంతకాలం హన్నాకృపను చదివిన తర్వాత ఒంగోలుకు సామ్యేలుకు 2,000రూ. మనియార్డరు చందా పంపించి, జరిగిన సంగతంతా ఫోనులో చెప్పారు. సామ్యేలు ఉమగారితో మాట్లాడి, వారి సాక్ష్యమును తెప్పించి హన్నాకృపలో ప్రచురించారు. ఉమగారు హన్నాకృపను ఆంధ్రాలో ఉన్న తమ బంధువులకు పంపించమని అడ్రసు పంపించినారు. ఉమగారి సాక్ష్యము ఈ పత్రిక 22 పేజీలో చూడండి.

✦ ✦ ✦

1958లో సామ్యేలు తండ్రి ఓ చిన్న చర్చి తాటాకు కప్పుతో కట్టించారు. అది కట్టినంతకాలం సామ్యేలు దగ్గరఉండి పనివారితో పనిచేయించేవాడు. గుడి బయట ప్రహరీ వాకిలి దగ్గర స్తంభాలు చాల జాగ్రత్తగా సిమెంటుతో కట్టించాడు. రోజు ఉదయం సిమెంటు పనిమీద తానే స్వయంగా నీళ్ళు పోసేవాడు. మూడు రోజుల తర్వాత ఓ స్తంభం మీద స్త్రీల తలవెంట్రుకల్లా ఓ సెంటరును చేసుకొని కిరణాల వలె వ్యాపించాయి. రెండవరోజు కొంచెం లావుగా ధారవలె కనిపించాయి. మూడవ రోజున నులక తాడు అంతలావుగా ఆ బిందువును ఆధారముగా చేసుకొని పగిలిపోవడానికి ప్రారంభమయింది. ఆ బిందువు వద్ద ఓ సీలతో సిమెంటు లేపితే ఓ మినపగింజ వచ్చింది. అది మొలకెత్తుతున్నది.

ఆ మినపగింజ బలమైన సిమెంటు స్థంబాన్ని పగల గొట్టగలిగింది. ఎలా? ఆ మినపగింజలో జీవం ఉన్నది. దేవుని వాక్యము ఎక్కడ, ఎప్పుడు విత్తినా అందులోని జీవం తప్పక ఒకరోజు ఫలిస్తుంది.

ఒకసారి పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలుకు వస్తూ కావలి స్టేషన్‌లో ట్రైన్ దిగుతున్న ఓ రిటైర్డు మాస్టరుగారికి జప్పత్పనేహు పుస్తకం ఉచితముగా ఇచ్చాడు. కొంతకాలము తర్వాత ఆ మాస్టరు గారి కుమారుడు స్టాలిన్, యం.ఎ. ఒంగోలు వచ్చి ఆసెనతు కొనుక్కొని వెళ్ళాడు. తర్వాత చాలామంచి స్నేహితుడైనాడు. పత్రికకు చందాగా వేల వేల రూపాయలు ఇచ్చాడు.

ఓ రోజు తాడేపల్లి గూడెంలో ఉదయం రైలు దిగి నడచి వెళ్తుంటే ఓ చర్చిముందు తలగుడ్డ తలకి చుట్టుకొని ఏదో పనిచేస్తున్న పాస్టరు దొరైరాజు గారిని – చాలాకాలం క్రితం చనిపోయిన ఎడ్వర్డుగారి చర్చి ఎక్కడ అని అడిగాడు. ఆయన ఎంతో ప్రేమగా, గౌరవంగా విడమర్చి చెప్పి పంపించాడు. ఇంత మంచి మనిషికి నేనేమి చెయ్యగలను అనుకొని పది అడుగులు వెనక్కి వచ్చి పెట్టెలోనుండి ఆసెనతు పుస్తకాన్ని ఇచ్చాడు సామ్యేలు. ఆయన రెండు సంవత్సరాల తర్వాత ఆసెనతు చదివి తన జీవితంలో మొదటి ఉత్తరాన్ని సామ్యేలుకు వ్రాసి తాడేపల్లి గూడెం పిలిపించుకొని పరామర్శించి వారి ఇంట్లో ఎన్నోసార్లు అతిథిగా చేపలు, మాంసం కూరలతో ఒక్కోసారి రెండు రకాల కూరలతో ప్రమీలమ్మ గారు భోజనం పెట్టేవారు.

ఇలా ఎన్నో అనుభవాలు..! దేవుని వాక్యము జీవము గలది. అసలు ఆ మాటకొస్తే ఈ రోజు వాక్యము విత్తే పనిచేస్తున్న వారున్నంత మంచిగా మరెవరు లేరు.

కేరళలో ఉన్న సదాశివన్ గారికి పత్రిక పంపిస్తుంటే సామ్యేలు మెంటల్‌వాడు అనిన వారు లేకపోలేదు. కాని ఉమగారి దగ్గరనుండి వచ్చిన మొదటి ఫోన్ కాల్ సామ్యేలును విశ్వాసంలో మరో మెట్టు సామ్యేలుతో వేయించింది.

నీ ఆహారమును నీళ్ళమీద వేయుము. చాలా దినముల తర్వాత అది నీకు కనబడును. ఎంతనిజం?

ఎర్నాకులం నుండి రాత్రి పదిగంటలకు కన్యాకుమారి చేరారు. రైల్వేస్టేషన్‌లో రాత్రికి తలదాచు కొందామంటే అది నిర్మానుష్యముగా ఉంది. ఓ ఆటోలో సిటీలోనికి వెళ్ళి హోటల్‌లో రూం తీసుకొని ఉదయాన్నే నాలుగున్నర గంటలకు సముద్రము ఒడ్డుకు చేరారు. అక్కడ సూర్యోదయం దివ్యంగా ఉన్నది. తర్వాత బోటులో సముద్రంలో ఉన్న చిన్న ద్వీపమునకు వెళ్ళి సాయంకాలం సూర్యాస్థమయాన్ని చూచి బస్‌లో బయలుదేరి తెల్లవారులు ప్రయాణం చేసి పాండిచ్చేరి వచ్చారు. సముద్రపు ఒడ్డున 'అరవింద' గెస్ట్ హౌస్, రూం.నెం.51 ఇచ్చారు. ఆ రూంలో అడుగుపెడితే సముద్రము మీద కట్టబడిన రూమ్‌లో ఉన్నట్లు అనిపించింది. అద్దె చాలా తక్కువ. నూట యాభై రూపాయలు ఒకరోజుకు.

ఓడలు రావటం పోవటం ఆర్.టి.సి.బస్‌ల వలె అనిపించింది. చాలా చక్కని పట్టణం. కేంద్రపాలిత ప్రాంత మయినందున పన్నులు తక్కువ అయినందువలన జీవితం చవకగా అనిపించింది. రైల్వే స్టేషన్ చాలా దగ్గర. అందువలన

ఉదయం అయిదు గంటలకు బయలుదేరి చెన్నైకి ఒంటి గంటకు చేరారు. పినాకిని ఎక్స్‌ప్రెస్ సెంట్రల్ స్టేషన్ తొమ్మిదవ ప్లాట్ ఫారము నుండి బయలుదేరవలసి ఉన్నది. కాని ఎగ్మోర్ నుండి బయలుదేరుతుంది అని చెప్పారు. మళ్ళీ ఎగ్మోర్ వచ్చి ట్రైన్‌లో కూర్చున్నారు సామ్యేలు దంపతులు. బండి బయలుదేరటానికి సిద్ధంగా ఉన్నది.

గుంటూరు నుండి శాంతవర్ధన్‌గారు ఫోను చేశారు. దినకరన్‌గారు చనిపోయారు. వారింటికి వెళ్ళి ఓ పూలగుచ్ఛం అక్కడ పెట్టి రమ్మన్నారు. ఇంతలో బండి బయలుదేరింది. ఆలోచించుకునే సమయం కూడాలేదు. దినకర్‌గారు చనిపోయారని సెంట్రల్ స్టేషన్‌లో నుండి బయలుదేరేటప్పుడు గుంటూరులోని శాంతవర్ధన్ గారి ద్వారా తెలిసింది.

✦ ✦ ✦

అక్టోబరు ఏడవతారీఖు శనివారం రాత్రి ఒంగోలులో బయలుదేరి ఆ రాత్రి హుస్సేనయ్య గారింట్లో విశ్రాంతి తీసుకొని ఉదయము ఐదు గంటలకు బయలుదేరి గిద్దలూరులోని జంగా చంద్రశేఖర్ గారింటికి వచ్చి ఆ రోజు గిద్దలూరు చర్చిలో, మధ్యాహ్నం దిగువ మిట్ట చర్చిలోను వాక్యము చెప్పి రాత్రి ఎనిమిద గంటలకు కడప చేరాడు సామ్యేలు.

శ్రీ నిమ్మగడ్డ సాలమన్ రాజు, నలందా గారలతో – కేరళ డివైన్ సెంటర్‌లోని అనుభవాలను పంచుకొని ఉదయం ఆరు గంటలకు ఆరోగ్యమాత చర్చికి వెళ్ళారు. రెండు గంటలకు దీప నర్సింగ్ హోమ్‌కు ఫోన్ చేసి డా॥ సరోజిని గారిని పలకరించి పులివెందుల వెళ్తున్నాను అని చెప్పాడు.

ఇప్పుడెందుకు? రేపు కదా ప్రార్థన అని అన్నారు డా॥సరోజినిగారు.

ఈరోజు రమ్మని డా॥పురోషోత్తమ రెడ్డిగారు చెప్పారమ్మ! ప్రార్థన కూటము సంగతి చెప్పలేదు అన్నాడు సామ్యేలు.

మేము రేపు వస్తాము అని చెప్పారు.

ఆ సాయంకాలం అక్టోబరు ఎనిమిదవ తారీఖున పులివెందులకు చేరాడు సామ్యేలు.

పురుషోత్తమరెడ్డి గారికి స్వర్గీయ భార్యకు అయిదుగురు అన్నదమ్ములు ఉన్నారు. పెద్దాయన డగ్లస్ బెన్నిసన్ – ఆయన చనిపోయారు. రెండు హోబర్ బెన్నిసన్ వచ్చారు. అడ్లి బెన్నిసన్‌గారు ఆయన మైసూరులో రిటైర్డు డి.ఎస్.పి.గా ఉన్నారు. తర్వాత ఫ్లారెన్సు ఫ్లావియా. తర్వాత హ్యారీ బెన్నిసన్. బెంగుళూరు లో నివాసము, రిటైర్డు అకౌంట్సు ఆఫీసరు. ఆఖరున హెరాల్డ్ బెన్నిసన్. ఆయన రిటైరైన తర్వాత కదిరిలో కాపురముండి వ్యవసాయము మరియు సొంతంగా ఓ ఇంగ్లీషు మీడియం స్కూలు నడిపిస్తున్నారు.

వీరంతా సామ్యేలును చాలా ఆదరించారు. చాలా మాట్లాడారు.

వీరంతా ఖచ్చితంగా ప్రతి జ్ఞాపకార్థ కూటమునకు వస్తుంటారు. బెంగుళూరు నుండి, మైసూరునుండి, కదిరి, గుంటూరు – అందరూ దాదాపు డెబ్భై దాటినవారే! వారింట్లో వారికి ఒకే సహోదరి. ఆమె జ్ఞాపకము వాళ్ళు జాగ్రత్తగా దాచుకున్నారు. సామ్యేలును చాలా ఆప్యాయంగా పలకరించారు. ఆ సాయంకాలం నాలుగు గంటలకు చుట్టాలు అందరు వచ్చారు. రిటైర్డు సి.యస్.ఐ. పాస్టరుగారైన థియోఫిలాస్ గారు ప్రార్థన నడిపించారు. పురుషోత్తమరెడ్డిగారి రెండవకోడలు డా॥అనురాధ వారి అత్తతో వారికిగల అనుబంధము గురించి మాట్లాడారు.

కూటము అయిపోయిన తర్వాత భోజనాలు ముగిసిన తర్వాత పురుషోత్తమ రెడ్డిగారి పెద్దకోడలు డా॥సరోజిని కడప వెళ్ళడానికి కారులో కూర్చుని సామ్యేలు గారు! మీరు మాతో కడప రండి, అక్కడనుండి ఒంగోలు వెళ్ళవచ్చును అన్నారు. లోనికి వెళ్ళి సూట్‌కేస్ తీసుకొని వచ్చి కారులో కూర్చుని కిటికి వైపు చూశాడు సామ్యేలు. పురుషోత్తమ రెడ్డిగారు కిటికి వద్ద నిలుచుని లోనికి రమ్మన్నాడు. సామ్యేలు లోనికి వెళ్తే ఆయన ఒక చిన్న ప్యాకెట్ చేతిలో పెట్టాడు. తేలికగా ఉన్నది. ఏంటి సార్! ఇది? అన్నాడు సామ్యేలు.

పాతిక! అన్నాడు. సామ్యేలుకు అర్థం కాలేదు. పాతిక వేలు, హన్నాకృపకు కంప్యూటర్ కొనండి అన్నాడు. సామ్యేలుకు నోట మాటరాలేదు. అలానే ఆయన మొహం చూస్తూ ఉండి పోయాడు. మీకు కంప్యూటర్ లేదుగా అన్నాడు.

'దానికొరకే ప్రార్థన చేస్తూ ఉన్నాను సార్! కాని ఇంత త్వరలో నాకు వస్తుంది అనుకోలేదు' అని ఆయనకు వందనాలు చెప్పి కారులో కూర్చున్నాడు. కడప బస్‌స్టాండ్‌లో సామ్యేలును దించి డా॥సరోజిని, ఆమె భర్త డా॥సత్యానందం గారు వెళ్ళిపోయారు.

పాతికవేలతో రాత్రి తొమ్మిదిన్నర గంటలకు ప్రక్కనే అపార్ట్‌మెంటులో ఉంటున్న రీజనల్ మేనేజరు ఆర్.టి.సి., సాలమన్‌రాజు గారి దగ్గరకు వెళ్ళాను. కంప్యూటర్‌కి పురుషోత్తమరెడ్డిగారు పాతికవేలు ఇచ్చిన సంగతి విని ఆ భార్యా భర్తలిద్దరు బహుగా సంతోషించారు.

✦ ✦ ✦

అప్పటికి ఓ సంవత్సరం నుండి కంప్యూటర్ కొరకు ప్రభువును ఎంతగానో ప్రార్థిస్తున్నాడు సామ్యేలు. కొన్నిసార్లు అవిశ్వాసియై అప్పుగా కూడా కొనాలని అనుకొన్నాడు.

ఓ రోజు సాయంకాలం భార్యతో బయట కూర్చుని ఉంటే రాణి అనె ఆమె వచ్చి, 'సార్! పాతికవేలు చీటిలో చేరుతారా?' అని అడిగింది. అలా అయితే కంప్యూటర్ కొనుక్కోవచ్చును. ఒకవేళ దేవుడే ఈమెను పంపించాడేమో అనుకొని 'నేను చేరతాను – అయితే రెండో నెలలో నాకు డబ్బు ఇవ్వాలి' అన్నాడు సామ్యేలు. 'చూస్తాము' అని ఆమె వెళ్ళిపోయింది.

అయితే సావిత్రి – 'ఎందుకండీ చీటిలో చేరేది?' అన్నది. 'కంప్యూటర్ కొనడానికి' అన్నాడు సామ్యేలు. 'ఇప్పుడు మనకున్నవన్నీ ఏమి పెట్టికొన్నాము? చీటి పాడితే పాతికవేలు రావు. ఇంతకాలం విశ్వాసం మీద నడచి ఇప్పుడు చీట్లు కట్టి సాగిస్తామా?' అన్నది. మరునాడు సామ్యేలు రాణి ఇంటికి వెళ్ళి 'అమ్మ! నేను చీటిలో చేరను' అన్నాడు. ఆమె కొంచెం బలవంతము చేసింది. కాని సావిత్రి చెప్పిన మాట యదార్థము కదా! మనకవసరమైనవి అన్నీ ప్రభువే ఇచ్చాడు. ఇది కూడా ఒకరోజు ఆయన ఇస్తాడు. అప్పు చెయ్యడం, చీట్లు కట్టడం, దేవుని శక్తిని మనం శంకించినట్లే కదా! అనుకొన్నాడు.

కాని ప్రభువు అద్భుతమైన రీతిలో పురుషోత్తమరెడ్డి గారిని ప్రేరేపించి, దాని అవసరతను తీర్చాడు. ఒంగోలు వచ్చిన తర్వాత తన రెండవ కుమారుడు ఇమ్మానుయేలు ఆ పాతిక వేలు తీసుకొని తన స్నేహితునివద్ద రాయితీలో ముప్పైరెండు వేలరూపాయల కంప్యూటర్‌ని తీసుకొనివచ్చాడు.

తర్వాత మానిటర్ దిగువన 'ఫ్లేవియా' అని ఇంగ్లీషులో అక్షరాలు అతికించాడు. హన్నాకృప ఆఫీసుకు వచ్చినవారు 'ఫ్లేవియా' అనేమాట చదివి 'అది ఏమిటి?' అంటారు. అప్పుడు విశ్వాసములో ప్రభువు కంప్యూటర్ ఎలా ఇచ్చింది సాక్ష్యము చెపుతాడు. కాని ప్రింటర్ లేనందున మాస్టర్లు బజారులో తీయించవలసి వచ్చేది.

పులివెందుల వెళ్ళవలసి వచ్చింది. పురుషోత్తమరెడ్డి గారితో 'మీ రెండవ కుమారుడు థామస్ రెడ్డి గారు, ఆయన భార్య అనురాధ 'తిరిగి జన్మించిన' విశ్వాసులు కదా! వారి సాక్ష్యము ఇస్తారా?' అని అడిగాడు.

'మీరు వెళ్తారా?' అన్నాడు పురుషోత్తమరెడ్డిగారు.

'వారు సాక్ష్యము ఇస్తామంటే తాడిపత్రి వెళ్తాను' అన్నాడు సామ్యేలు.

పురుషోత్తమరెడ్డిగారు తాడిపత్రికి ఫోన్ చేసి, సంగతి వారికి చెప్పి 'సాక్ష్యము ఇస్తారా?' అని అడిగాడు. తర్వాత సామ్యేలుతో 'మీరు తాడిపత్రి వెళ్ళండి' అన్నాడు.

ఆరోజు ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు తాడిపత్రి బస్ స్టాండులో దిగాడు. శారదా నర్సింగ్ హోమ్ చాలాదగ్గరే! ఆ దంపతులిద్దరు భోజనము చెయ్యకుండా సామ్యేలు కోసం ఎదురుచూస్తున్నారు.

ఓ రెండు గంటలు – దేవుని విషయాలు మాట్లాడు కొనిన తర్వాత సామ్యేలు థామస్ రెడ్డిగారికి 'హన్నాకృప' రసీదు పుస్తకం ఇచ్చాడు. ఆయన రశీదు వ్రాస్తూ 'నా దగ్గర డబ్బులు లేనప్పుడు వచ్చారు, ఎక్కువ ఇవ్వలేకపోతున్నాను' అని సామ్యేలుకు రశీదు పుస్తకం వ్రాసి ఇచ్చాడు. సామ్యేలు చూస్తే – ఐదువేలు అని వ్రాశారు. 'సార్! ఇంతవరకు ఈ పుస్తకములో ఇంతపెద్ద అమౌంట్ ఎవరు వ్రాయలేదు. దేవుడు గత నెలలో కంప్యూటర్ ఇచ్చాడు. ప్రింటర్ కొరకు ప్రార్థిస్తున్నాము. మీరు అయిదు వేలు వ్రాశారు, మంచిది సెకెండ్ హ్యాండ్ కొనుక్కోవచ్చు' అన్నాడు సామ్యేలు.

'క్రొత్తది ఎంతుంటుంది?' అన్నారు డా॥అనురాధ. 'నాకు సరిగ్గా తెలియదు. కాని ఎనిమిది, పది లోపల ఉండవచ్చును' అన్నాడు సామ్యేలు. మరలా ఓ గంటసేపు మాట్లాడుకున్న తర్వాత సాక్ష్యము అడిగాడు. 'ఇప్పుడు మనం మూడుగంటలు మాట్లాడుకున్నాము. ఈసారి వచ్చినప్పుడు ఇస్తాను' అన్నారు. సామ్యేలు శెలవు తీసుకోవడానికి లేచాడు. డాక్టరుగారు లోనికి వెళ్ళి కొంతడబ్బు తెచ్చి సామ్యేలు చేతిలో పెట్టి 'మొత్తం ఇచ్చాను' అన్నాడు.

సామ్యేలుకు అర్థంకాలేదు. ఆయనను చూస్తుంటే 'క్రొత్త ప్రింటరు కొనుక్కోవడానికి ఎనిమిదివేలు ఇచ్చాను' అన్నారు.

# కీ॥శే॥ వై.యస్. చిన్నకొండా రెడ్డి గారు

**క్రమశిక్షణ గల క్రైస్తవుడు (వై.యస్.లక్ష్మి, నాల్గవ కోడలు,** పులివెందుల గారి మాటలలో) :-

నా పేరు లక్ష్మి. నేను చిన్నకొండారెడ్డి గార్కి నాల్గవ కోడలును. మామామగారి గురించి కొన్ని సంగతులు మీతో పంచుకునే అవకాశం ఇచ్చిన దేవునికి స్తోత్రం! మా మామగారు క్రమశిక్షణ కలిగిన క్రైస్తవుడు. ప్రతిదినం ఉదయం ఐదు గంటలకు ఒక పాట పాడి, బైబిలు చదివి, ప్రార్థన చేసుకొని తరువాత దినమును ప్రారంభించే వారు. ప్రతిరాత్రి కూడ భోజనం తరువాత కుటుంబమంతటితో కలిసి పాట పాడి, బైబిలు ఒక్కొక్క దినం ఒక్కొక్కరితో చదివించేవారు. తరువాత మా మామగారే ప్రార్థన చేసేవారు. మా మామగారి దినచర్య ప్రార్థనతో ప్రారంభమై ప్రార్థనతో ముగిసేది.

మామామగారు 1993 జూలై 14 నుండి నవంబరు 14 వరకు జబ్బుతో ఉండినారు. జూలై 13వ తేది వరకు కూడ పొలం పనులు చేయించినారు. అప్పటికి ఆయన వయస్సు ఎనభై సంవత్సరములు. మా మామగారి దగ్గరకు వచ్చే వాళ్ళలో కొందరు ప్రార్థన చేసి వెళ్ళేవారు. మా నాన్న కూడా అదే సమయంలో హాస్పిటల్‌లో జబ్బుతో పడకలో ఉండినారు.

మా మామగారు నన్ను ఆంధ్రక్రైస్తవ కీర్తనలలో ఆయనకు నచ్చిన పాట చెప్పి పాడమనేవారు. బైబిలు చదివించేవారు, ప్రార్థన కూడా చేయించేవారు. ఒక దినాన నా అంతట నేనే 'స్తోత్రం చెల్లింతుము - స్తుతి స్తోత్రం చెల్లింతుము' అనే పాట పాడినాను. ఆ పాట మా మామగారికి చాలా నచ్చింది. కమలాంటి, జయాంటి ఆ దినం సాయంత్రం వెళ్ళినపుడు ఉదయం పాప పాడిన పాట చాలా బాగుందమ్మా, ఆ పాట పాడమని చెప్పినారని కమలాంటి చెప్పినారు. నాకు ఆ విధంగా ఆత్మీయంగా మా మధ్య దినదినానికి అనుబంధం వృద్ధి చెందినది. నేను ఆవిధంగా ఆత్మీయంగా బలం పొందాను. మా మామగార్కి ఇష్టమైన ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు :

1. యేసు నన్ను ప్రేమించినావు - పాపినైన నన్ను ప్రేమించినావు
2. ఘనమైన క్రీస్తు కృపను కనుగొంటినపుడు
3. సీయోను పాటలు పాడుచు సీయోను వెళ్ళెదము
4. కరుణ పీఠము జేరరే

**నాన్న - మేరు పర్వతం, అమ్మ ధీరవనిత (వై.యస్. మనోహర రెడ్డి, ఐదవ కుమారుడు,** పులివెందుల గారి మాటలలో) :-

మా నాన్నగారితో నా అనుభవాలు పంచుకొనే ముందు మాకు స్నేహం, ఆప్యాయత, ప్రేమ పంచిన మా మాతృమూర్తి గురించి మొదటిగా చెప్పుకోవాలి. మా బాల్యం గురించి, మా భవిష్యత్తు గురించి, మా ఆలన, పాలన గురించి ఎంతో శ్రమించే అమ్మను చూసి మాకు ఎప్పటికీ ఆనందంగా ఉంటుంది. మా ఆదర్శకుటుంబంలో అమ్మ పాత్ర అజరామరము. ముఖ్యముగా మా అమ్మ నాపై కురిపించిన ప్రేమ నేనెప్పటికీ మరువలేను. ఆ కాలంలోనే అంటరానితనాన్ని రూపుమాపాలని మాకు బోధించిన మహాసాధ్వి, ఆచరించి చూపిన ధీరవనిత మా అమ్మ. ఇక మా నాన్నగారి గురించి చెప్పాలంటే మేరుపర్వతము లాంటివాడు. కష్టాలు, అవాంతరాలు ఎన్ని ఎదురైనా నమ్మిన సిద్ధాంతానికి తాను బలైపోయినా మొక్కవోని విశ్వాసముతో ముందుకెళ్ళిన ధీరుడు మా నాన్న. స్వచ్ఛతకు, ఆత్మ విశ్వాసానికి, నాణ్యతకు, నమ్మకానికి పెట్టింది పేరు మా నాన్న. అలాంటి నాన్నను పొందిన మా జీవితము చరితార్థము.

నాన్నగారి గురించి పుస్తక ప్రచురణ చేయాలనే తలంపు మా అన్నగారికి కలిగి, అందులో మా అనుభవాలు కూడా కొన్ని జత చేయమని మా అన్న వై.యస్. ప్రకాశ్ రెడ్డి గారు కోరినప్పుడు, నాన్నతో నా అనుభవాలు పంచుకొనే అవకాశం కలిగినందుకు నాలో కలిగిన సంతోషం వర్ణణాతీతం. నాన్న గురించి ఈ పుస్తకములో నా అనుభవాలు కొన్నైనా పంచుకొనేందుకు అవకాశం కలిగించిన మా అన్నగారికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. నా మీద మా నాన్నగారికి బాగా చదవగలనని గట్టి నమ్మకము ఉండేది. నన్ను యం.బి.బి.యస్. చదివించే ప్రయత్నము చేసారు. మా అన్న వై.యస్. ప్రకాశ్ రెడ్డి గారు కూడ నన్ను యం.బి.బి.యస్.లో చేర్పించాలని చాలా ప్రయత్నము చేశాడు. కానీ అప్పటి మా ఆర్థిక పరిస్థితి, మా చదువులను, పెళ్ళిళ్ళను శాసించాయి. నాన్న కోరిక నెరవేర్చలేకపోయాను. నాన్న మనసెరిగిన నేను ఎలాగైనా ఎప్పటికైనా మా కుటుంబంలో నుంచి కనీసం ఒకరినైనా యం.బి.బి.యస్. చదివించాలనుకొన్నాను. నా చిన్న కుమారుడు వై.యస్.అరుణ్ కుమార్ రెడ్డి నాలోని తపనను, మా నాన్నగారి

కోరికను నెరవేర్చగలిగాడు. నా బాల్యంలో నాన్నగారితో ఎక్కువగా పనుల వద్దకు వెళ్ళేవాడిని. నాన్నగారు పనిలో దైవత్వము చూపేవారు. ఒకసారి ఒక్క నిర్ణయానికి వచ్చాక వెనక్కి తగ్గేవారు కారు. నాన్నగారికి 1976-77లో రేణిగుంట-బాలపల్లిలో ఒక రైల్వే కాంట్రాక్టు పని వచ్చింది. మారిన పరిస్థితులవల్ల ధరలు తీవ్రముగా పెరగడము, డీజిల్ ధరలు దాదాపు రెండింతలు కావడము వల్ల ఆ కాంట్రాక్టులో విపరీతముగా నష్టము వచ్చే పరిస్థితి అని ముందే తెలిసినా ఇచ్చిన మాటకు కట్టుబడినవాడైన మా నాన్న మా ఆస్థి మొత్తము అమ్మి ఋణములను తీర్చుటకు వెనుకడుగు వేయలేదు. ఆ కాంట్రాక్టు పని జరుగుచుండగా ఒకరోజు నాకు జ్వరము వచ్చినది. ఆ రోజు ఉదయం కూలి వాండ్లను పనిలోకి పెట్టి నేను టిఫిన్ చేయడానికి రూములోనికి వచ్చాను. అప్పుడే అక్కడకు వచ్చిన నాన్న పనిమీద అశ్రద్ధ చూపించావని, రేపటి గురించి ఏర్పాట్లు చేయలేదని తీవ్రంగా మందలించారు. కాని నా జ్వరం తీవ్రత వల్ల మరుసటి రోజు కావలసిన ఇసుక, కంకరు విషయం గమనించలేక పోయాను. మరుసటి రోజు విషయము తెలుసుకున్న నాన్న పనివద్ద తీసుకొనవలసిన జాగ్రత్తలు, పని చేయించాల్సిన విధానం నాకు బాగా చెప్పారు. అప్పుడు నాకు చాలా సంతోషము అనిపించింది. మా నాన్నగారు నా భవిష్యత్తు కొరకు ఈ సలహాలను ఇచ్చారనిపించింది.

నేను 1979 ఏప్రిల్ నెలలో పులివెందులలో వర్కు షాపు పెట్టాను. (మొదట్లో నా నిర్ణయాన్ని మా నాన్నగారు ఒప్పుకోలేదు) నాన్నగారు, మా మామ సి.వి. సుబ్బారెడ్డి గారు చాలా బాగా సహకరించినారు. అయితే మా నాన్నకు నేను వర్కుషాపు పెట్టడం నచ్చలేదు. నన్ను వైద్యునిగా చూడాలన్నది నాన్నగారి కోరిక. నాన్నగారు మా వర్కుషాపు పనితీరును గమనించి నన్ను అభినందించారు. ఇంతమంది పనివారికి ఉపాధి కల్పించిన నువ్వు ఒక ఐ.టి.ఐ. స్కూలు పెట్టి పేదలకు ఉచితముగా విద్య నేర్పించమని కోరినారు. అప్పటి మా ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నేను నాన్న ప్రతిపాదనలను నిరాకరించాను.

అయితే కాలక్రమేణా నాన్నగారి మాటలు పదే పదే నాకు గుర్తుకు వచ్చేవి. అప్పటినుండి పేదపిల్లల చదువు కొరకు సహాయం చేయడం అలవాటుగా, బాధ్యతగా తీసుకొన్నాను. నాన్నగారు తన కుటుంబం, తనవారి గురించే కాక ఇతరులను గురించి, వారి ఇబ్బందుల గురించి కూడా ఆలోచించేవారు. ఒకసారి మా నాన్నగారితో కలిసి ధర్మవరంనకు కారులో బయలుదేరాను. కదిరి ఘాట్‌లో మూడవ మలుపు వద్ద ఒక బండరాయి రోడ్డు మీద ఉండినది. ఆ కాలంలో లారీలు ఘాట్‌రోడ్డులో సరిగ్గా ఎక్కలేక వాటిని టైర్ల క్రింద పెట్టుకొని ఘాట్‌ను ఎక్కించేవారు. వెంటనే నాన్నగారు డ్రైవరును కారు ఆపమని చెప్పి, నన్ను దిగి ఆ రాయిని తొలగించమని చెప్పారు. అలాగే ఘాట్ మలుపులలో ఉన్న రాళ్ళను నాతో తీయించారు. ఆ రాళ్ళ వలన మా కారుకు ఎటువంటి ఆటంకటము లేకున్నా, ఇతరులకు ఆ రాళ్ళతో సమస్య రాకూడదని దూరదృష్టితో ఆ పని నాతో చేయించారు. నాన్నగారి మనసెరిగిన నేను చాలా సంతోషపడ్డాను. 1993 జూలై నెలలో నాన్నగారికి అకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణించింది. హైదరాబాదుకు తీసుకొనివచ్చారు. అప్పుడు నేను హైదరాబాదులోనే ఉన్నాను. ఆ రోజు 'మెడ్విన్ హాస్పిటల్'లో నాన్నగారికి వీపు నుండి నీరు తీసేటప్పుడు ఆయన పడిన బాధ నేను చూడలేకపోయాను. ఇప్పుడు కూడా ఆ సంఘటన చాలాసార్లు గుర్తుకొస్తుంది.

నాకు ఇప్పుడు కూడా అనిపించేది ఒక్కటే - మా నాన్నగారు యేసుక్రీస్తును నమ్మి పదిమందికి యేసుక్రీస్తును గురించి గొప్పగా బోధించినప్పటికి, ఆయనకు అలాంటి పరిస్థితి రావడం ఏమిటి? అని. మా నాన్నగారు తరువాత పులివెందులకు వచ్చి ఇక్కడ గంగిరెడ్డి బావ, సుగుణక్క దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకొంటూ, కొన్ని నెలల తర్వాత అంటే 1993 నవంబరు 14వ తేదీన (ఆదివారం) పరమపదించినారు. ఆ కొద్దికాలములో మా నాన్నగారికి కొంతైనా సేవచేసే భాగ్యము కలిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది. మా అమ్మనాన్నలకు ఎక్కువగా సేవచేసే భాగ్యము నాకు కలుగలేదు. మా అమ్మ, నాన్న, మా తమ్ముడు దగ్గర ఉండేవాళ్ళు. ఒకసారి వారిద్దరు మా ఇంటికి వచ్చి మేము ఇక ఇక్కడే ఉంటామని అన్నారు. అమ్మ నాన్నకు సేవచేసే భాగ్యము వచ్చిందని అనుకున్నాను. కాని ఆ మరుసటి రోజే వాళ్ళిద్దరు మా తమ్ముని వద్దకు వెళ్ళారు. అప్పుడు చాలా బాధపడ్డాను. కాని నా బాధకంటే వాళ్ళ సంతోషమే ముఖ్యం కాబట్టి దాన్ని గురించి అంత ఎక్కువగా పట్టించుకోలేదు. నాన్న నా దగ్గర ఉన్నా అంత బాగా చూసుకునేవాడిని. నిజంగా మా అమ్మ - నాన్న చనిపోయిన తరువాత కూడా తమ్ముడు 'జోసఫ్ రెడ్డి' దగ్గర చాలా సంతోషముగా ఉంది. మా నాన్నగారు అందరిని ప్రేమించడము నేర్పించారు. పేదలకు, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం, నమ్మివచ్చిన వారికి అండగా ఉండడం, కష్టపడి బ్రతకడము నేర్పించారు. బైబిల్ చదవడము నేర్పించారు. ప్రార్ధన చేయడము నేర్పించారు. నాన్నగారు ఎంతో శ్రద్ధగా మాకు నేర్పించిన ఆధ్యాత్మిక భక్తి జీవితంలో కొనసాగాలని కోరుకుంటున్నారు. ఇదే మేము ఆయనకు ఇవ్వగలిగిన నిజమైన బహుమానం.

సాక్ష్యము

# శ్రీమతి ఉండవల్లి ఉమా లక్ష్మణరావు

మాది పశ్చిమ గోదావరి జిల్లా, కోవూరు గ్రామము. మేము కమ్మవారము. మా తండ్రి ఉండవల్లి సత్యనారాయణ, తల్లి ఝాన్సీ. మాది హిందూ కుటుంబము. నాకు ఒక అక్క, ఇద్దరు తమ్ముళ్ళు వున్నారు. నేను బి.యస్సీ వరకు చదివాను. మా బంధువులలో కొందరు యేసుప్రభువును నమ్ముకున్నాను. వారి ద్వారా చిన్నతనములోనే యేసుప్రభువు మహిమ గురించి విన్నాను.

1985 అక్టోబరులో పశ్చిమ గోదావరి జిల్లా, కొమ్ముగూడెం వాస్తవ్యులు శ్రీ వట్టికూటి రామారావు, బుల్లెమ్మాయిగారి రెండవ కుమారుడు లక్ష్మణరావుగారితో వివాహము జరిగినది. వివాహమైన రెండు నెలలకు పై చదువు నిమిత్తం జపాను దేశమునకు వెళ్ళారు. తర్వాత ఒక నెలకు నేను కూడా జపాను దేశం వెళ్ళాను. ఒకటిన్నర సంవత్సరం తర్వాత పాలిమర్ డాక్టరేట్ తీసుకొని మావూరు వచ్చాము. 1987 ఆగష్టు నెలలో మాకు ఒక కుమార్తె జన్మించింది. మా వారికి 1987లో త్రివేండ్రంలో ఇస్రోలో సైంటిస్ట్‌గా ఉద్యోగం వచ్చింది. అందువల్ల 1988 ఫిబ్రవరి లో త్రివేండ్రంలో కాపురం పెట్టాము.

మేము జపాన్‌లో ఉన్నప్పుడు చాలామంది జపాను వారితో స్నేహం ఏర్పడింది. నా స్నేహితురాలు ఒకామె వెడ్డింగ్ డ్రస్ బ్రైడల్ మేకప్ సంస్థలో పనిచేసేది. ఆమె ఒకసారి క్రిస్మస్ పండుగ రోజున నన్ను క్రైస్తవ పెండ్లి కుమార్తెవలె తెల్లని గౌను వేసి, తలకి వెయిల్ వేసి, పెండ్లి కుమార్తెవలె అలంకరించారు. మా వారికి పెండ్లి కుమారు నిగా డ్రస్ వేశారు. మమ్మల్ని ఉంగరాలు మార్చుకోమని చెప్పి ఫోటోలు తీశారు. అప్పటికి మేము ఇంకా రక్షణలోనికి రాలేదు. ఇదంతా మేము రక్షణలోకివచ్చి యేసుప్రభువును మా స్వరక్షకునిగా అంగీకరించి బాప్తీస్మము తీసుకోవడానికి ప్రభువు ప్రణాళిక అని మాకు తెలియదు. యేసుప్రభువును గురించి కూడా మాకు తెలిసింది స్వల్పమే!

తర్వాత మూడు సంవత్సరాలకు మాకు బాబు జన్మిం చాడు. త్రివేండ్రంలోనే ఒక స్థలము కొని ఇల్లు కట్టుకోవటం ప్రారంభించాము. మా వారు సైంటిస్ట్ అయినందున ఇల్లు కట్టించేటప్పుడు పనివారు పెట్టే ఇబ్బందులకు చాలా విసికిపోయారు. గోడల వరకు కట్టిన ఇల్లు ఆగిపోయింది. మేము చాలా బాధపడిపోయాము. భాష తెలియని ఊరు. సహాయం చేసే స్వంతవారు చాలా దూరంలో వున్నారు. ఎవరు సహాయం చేస్తారు? ఎవరు సహాయం చేసినా కొంత వరకే కదా!

అప్పుడు యేసుప్రభువు జ్ఞప్తికి వచ్చాడు. ఆయనను గురించి నాకు కొంచెమే తెలిసినా, ఆయన జీవముగల దేవుడు, సహాయపడే దేవుడు, అని ఆయనకు ప్రార్థించటం ప్రారంభించాను. అసలు నాకు ప్రార్థన చెయ్యటం కూడా సరిగా రాదు. అయినా నా హృదయంతో ప్రార్థించటం ప్రారంభించాను. ఇక్కడ సముద్రపు ఒడ్డున 'వెట్టికడ' చర్చి ఉంది. అక్కడకి వెళ్ళటం ప్రారంభించాము. ప్రభువు సహాయంచేశాడు. 1994, అక్టోబరు నాటికి ఇల్లు పూర్తైంది. ఆ సమయంలో ఒక మంచి క్రైస్తవ కుటుంబమును మా యింటి వెనకాల కాపురం వుండుటకు దేవుడు పంపించాడు. వారు మళయాళీలు అయినా చక్కగా తెలుగు మాట్లాడతారు. వారు హైదరాబాద్‌లో రైల్వే ఇంజనీరుగా పనిచేసి రిటైరై ఇక్కడ నివశించటానికి వచ్చారు.

ఇక్కడ పాస్టరు సురేష్ బెరియన్ ఇంగ్లీషు సర్వీసు ప్రారంభించారు. మేము ఆ సర్వీసుకు క్రమంగా హాజరయ్యే వారము. ఆ చర్చి పేరు పిలిగ్రిమ్స్ హైలాండు చర్చి. అందువలన యేసుప్రభువును గురించి ఇంకా ఎక్కువ తెలుసుకోగలిగాము. ఈ విధంగా పదమూడు సంవత్సరాల నుండి మా జీవితము ఆశీర్వాదకరంగా ముందుకు సాగు చున్నది. మా పిల్లలకు చిన్నతనం నుండి వారి హృదయ ములలో దేవుని వాక్యము నాటబడినది. తర్వాత నేను, నా భర్త బాప్తీస్మము తీసుకున్నాము.

మా పాప స్వాతి ఇప్పుడు బి.టెక్. ఫైనల్ ఇయర్ చదువుచున్నది. మా బాబు చైతన్య రామకుమార్ ఇంటర్ చదువుతున్నాడు. వారిద్దరికి యేసు ప్రభువుమీద ఎనలేని

ప్రేమ వుంది. వారిద్దరూ రక్షణ పొంది బాప్తిస్మము పొందియున్నారు. వారి స్నేహితులకు కూడా యేసుప్రభువు ప్రేమను గురించి చెప్పటం సంతోషము.

మేము ప్రతివారం ఇంగ్లీషు ఆరాధనకు వెళ్తున్నాము. అప్పటినుండి ఇప్పటివరకు ఒక్కసారి అయినా ఆగలేదు. యేసుని ప్రేమను రూచి చూచిన తర్వాత చాల సంతోషంగా వున్నాము. నేను మా అక్కగారిని కూడ దేవునిలోనికి నడిపించాను. ఆమె కూడ రక్షణ పొందారు. అనుకోకుండా నా పెండ్లి అయిననాటికి మా పెద్ద ఆడపడుచుగారు దేవుని రక్షణలోనికి వచ్చారు. తరువాత మా అత్తగారు, మామగారు కూడ రక్షణలోనికి వచ్చారు. వారు కొమ్ముగూడెం గ్రామము లో దేవుని సహాయంతో ఒంటరిగా జీవిస్తున్నారు. ఎప్పటికైనా మా బంధువులందరూ సత్యము తెలుసుకొని రక్షణ పొందాలని నా అభిలాష.

ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలాఖరులో మా ఇంగ్లీషు ఆరాధనకు వచ్చే పి.సదాశివన్ అనే సహోదరుడు నా వద్దకు వచ్చి 'హన్నాకృప' మాసపత్రికను ఇచ్చి, 'ఇది మీ భాష పత్రిక కదా' అన్నారు. ఆయన మంచి విశ్వాసి. అరవై సంవత్సరాల వయస్సుంటుంది. 'మీకు ఈ పత్రిక ఎలా వచ్చింది' అని అడిగాను. 'ఎర్నాకుళం ట్రైన్‌లో ఒక వ్యక్తి నాకిచ్చాడు' అని చెప్పాడు. తర్వాత నుండి ప్రతి నెలా 'హన్నాకృప' నాకు ఇస్తుండేవారు.

అక్టోబర్ నెలలో ఆ పత్రిక ఎడిటర్‌గారికి ఉత్తరం వ్రాశాను. ఆయన (కొడవటికంటి) రచనలు నాకు పంపించారు. నేను పశ్చిమ గోదావరి జిల్లాలో వున్న మా బంధువులకు కూడా హన్నాకృపను పంపించమని వారికి కానుక పంపించాను. వారి ద్వారా ఒక తెలుగు బైబిలును ఇక్కడికి తెప్పించుకున్నాను.

హన్నాకృపలో మా సాక్ష్యము ప్రచురించవలెనని ఎడిటర్‌గారు కోరినందున ఈ సాక్ష్యము పంపిస్తున్నాను. నా సాక్ష్యము మీకు ఆశీర్వాదకరంగా, దేవునికి మహిమ కరముగా వుండాలని ఆ దేవదేవునికి నా వందనములు చెల్లిస్తున్నాను.

ఇట్లు,
**ఉమా లక్ష్మణరావు**, త్రివేంద్రం

## 26 వ పేజి తరువాయి భాగం

ఎంతగా అడిగినా ఆక్సినోన్ నోరెత్తలేదు. కనుక ఆసంగతి అంతటితో వదిలివేశారు. ఆ రాత్రి నిద్రపట్టే సమయములో చీకట్లో ఎవరో వచ్చి ఆక్సినోన్ పడకమీద కూర్చున్నారు. ఆక్సినోన్ నిదానించి చూస్తే అతను మేకర్.

నావద్దనుండి ఇంకా నీకేమి కావాలి? ఇప్పుడు నువ్వు నా వద్దకు ఎందుకు వచ్చావు? అన్నాడు. మేకర్ ఏమి మాట్లాడ లేదు. నువ్వు ఇక్కడనుండి వెళ్ళు, లేదా నేను గార్డును పిలుస్తాను అన్నాడు. అప్పుడు మేకర్ మోకాళ్ళ మీద వంగి 'నన్ను క్షమించు' అన్నాడు. ఎందుకు? అన్నాడు ఆక్సినోన్.

ఆ వ్యాపారి గొంతుకోసి కత్తిని నీ సంచిలో పెట్టింది నేనే! నిన్ను కూడా చంపాలనుకున్నాను. కాని బయట అలికిడి అయింది. కత్తిని నీ సంచిలో పెట్టి కిటికీలోనుండి పారిపొయ్యాను అన్నాడు. ఆక్సినోన్ నిశ్శబ్దంగా విన్నాడు. ఏమి చెప్పాలో తెలియలేదు. మేకర్ అలా మోకాళ్ళ మీదనే ఉండి చేతులు జోడించి దేవుని ప్రేమను బట్టి నన్ను క్షమించు. నేను నా నేరాన్ని ఒప్పుకొంటాను. ఆ వ్యాపారిని చంపింది నేనే అని చెబుతాను. అప్పుడు నిన్ను వదిలివేస్తారు. నువ్వు ఇంటికి వెళ్ళవచ్చు అన్నాడు.

ఇది చెప్పడం నీకు తేలికే! ఇప్పుడు ఇరవై ఆరు సంవత్సరాలయింది. నా భార్య చనిపోయింది. నా బిడ్డలకు నేనెవరో తెలియదు. నేనెక్కడికి పోవాలి? అన్నాడు. మేకర్ లేచి నిలబడలేదు. కాని తన తలను నేలమీద కొట్టుకోవడం ప్రారంభించాడు. నన్ను క్షమించు, నన్ను క్షమించు అని ఏడుస్తూ - వాళ్ళు నన్ను కొరడాలతో కొట్టినపుడు పడిన బాధ ఇప్పుడు నీ విషయంలో పడే బాధ కంటే తక్కువే! నాయందు నీకు గల జాలితో యేసుప్రభువు పేర నన్ను క్షమించు. ఆక్సినోన్ కూడా ఏడ్వడం మొదలుపెట్టాడు. దేవుడు నిన్ను క్షమిస్తాడు. నేను నీకంటే వందరెట్లు తక్కువ వాడినను కుంటాను అని అనినప్పుడు అతని హృదయం తేలిక అయిపోయింది. సంతోషం అతని హృదయంలోకి వచ్చింది. ఇంటిమీద ధ్యాస పోయింది. ఈ చెరసాలను వదిలివెళ్ళాలనే తలంపుపోయింది. కాని తన మరణం కొరకు వేచిచూడసాగాడు. ఆక్సినోన్‌కు మాటపోకుండా మేకర్ ఇరవై ఆరు సంవత్సరాల క్రితం ఒక వ్యాపారి గొంతు కోసి చంపిన విషయం అధికారుల వద్ద ఒప్పుకొన్నాడు. ఆక్సినోన్ నిర్దోషి అని తీర్పు వెడలి, సైబీరియాలోని చెరసాల చేరేటప్పటికి ఆక్సినోన్ చనిపోయి ఉన్నాడు.

# నిజం దేవునికి తెలుసు కాని నిజం
# తెలిసిన దేవుడు వేచియుండును

4

లియోటాల్‌స్టాయ్

ఇవాన్ ఆక్సినోన్ అనే యవ్వనస్తునికి 'వాల్దామీర్' అనే పట్టణంలో రెండు షాపులు, ఒక ఇల్లు ఉన్నవి. ఇతను ఉంగరాల జుట్టు కలిగిన అందమైనవాడును, చక్కగా పాటలు పాడుటలో అమితాసక్తి కలిగివున్నాడు. తాగినప్పుడు కొంచెం ఎక్కువగా త్రాగితే అప్పుడు కొంచెం గోలచేసేవాడు. పెండ్లియిన తర్వాత త్రాగుడు మానినా అప్పుడప్పుడు తాగుతూ వుండేవాడు.

ఒక ఎండాకాలము రోజు 'నిజరీ' సంతకు వెళ్ళటానికి బయలుదేరాడు. అతని భార్య 'ఇవాన్ ఆక్సినోన్! ఈ పూట సంతకు వెళ్ళవద్దు. రాత్రి నిన్ను గురించి ఓ చెడ్డ కలగన్నాను' అన్నది. అందుకు ఇవాన్ 'నేను సంతలో తప్పిపోతానని భయమా?' అన్నాడు నవ్వుతూ.

'అదేమో నాకు తెలియదు. కాని నువ్వు సంతనుండి తిరిగి వచ్చినప్పుడు నీ తలమీద టోపీ తీస్తే నీ వెంట్రుకలన్నీ తెల్లబడిపోయాయి అన్న పీడకల వచ్చింది' అన్నది.

'అట్లయితే అది మంచి శకునమే! అంటే ఇప్పుడు నేను సంతలో ఈ సామానంతా అమ్మి నీకు ఓ బహుమానము తీసుకొనివస్తాను చూడు' అని బండిలో సంతకు వెళ్ళిపోయాడు. అలా సగముదూరము ప్రయాణము చేసిన తర్వాత తనకు ముందే పరిచయమున్న మరో వ్యాపారిని కలుసుకున్నాడు. వారిద్దరు ఒక సత్రంలో బసచేసారు. ఇద్దరు కలిసి టీ త్రాగి ప్రక్కప్రక్కనే ఉన్న ఎవరి గదులలో వారు నిద్రపోయారు.

ఆక్సినోన్ ఎప్పుడూ పెందకడనే నిద్రలేచి చల్లపూట ప్రయాణం చేసే అలవాటు ఉండడం వలన తన బండి నడిపే వానిని లేపి గుఱ్ఱాలను బండికి కట్టమన్నాడు. తను బసచేసిన సత్రం యజమాని సత్రం వెనుక భాగాన నివశిస్తున్నాడు. అతనికి చెల్లించవలసిన అద్దె చెల్లించి ప్రయాణమైపోయాడు. ఇరవై అయిదు మైళ్ళ తరువాత గుఱ్ఱాలకు కొంచెం మేత వెయ్యాలని ఓ సత్రం వద్ద ఆగి పంచలో తను కూడా ఆగి విశ్రాంతి తీసుకొని అల్పాహారము చెయ్యమని సత్రం వారికి చెప్పి తన చేతిలోని 'గిటారు' తీసుకొని పాడడం ప్రారంభించాడు. అంతలో ఓ పోలీసు ఆఫీసరు బండి వచ్చి ఆగింది. అందులో నుండి ఓ ఆఫీసరు కిందకు దిగాడు. అతనివెంట ఇద్దరు సిపాయిలు వచ్చారు. ఆ ఆఫీసర్ ఆక్సినోన్‌తో మాట్లాడాడు. కొంచెం టీ తీసుకొందాము అని ఆక్సినోన్ వారిని అడిగాడు. కాని ఆఫీసరు నువ్వు రాత్రి ఎక్కడ పండుకొన్నావు? నువ్వు ఒక్కడివే ఉన్నావా? లేక నీతో తోటి వ్యాపారి కూడా ఉన్నాడా? ప్రొద్దున నువ్వు ఆ వ్యాపారిని చూశావా? అంత ప్రొద్దున్న చీకటి ఉండగానే ఎందుకు ప్రయాణం చేస్తున్నావు? అని ప్రశ్నించటం ప్రారంభించాడు.

ఈ ప్రశ్నలన్నింటికీ జరిగిన సంగతంతా ఆఫీసరుకు చెప్పి - మీరు నన్ను ఎందుకు ఇన్ని ప్రశ్నలు వేస్తున్నారు? నేనేమి దొంగను, దోచుకునేవాడ్ని కాదు కదా? నేను నా వ్యాపారం నిమిత్తం వెళ్తున్నాను. నన్ను మీరు ఇలా ప్రశ్నలు అడుగకూడదు అన్నాడు. నేను ఈ జిల్లా పోలీసు ఆఫీసర్ని. రాత్రి నీతో కలిసి బసచేసిన వ్యాపారిని ఎవరో గొంతుకోసి చంపివేశారు. కనుక నీ సామాను మేము సోదా చెయ్యాలి అని ఆ పోలీసులతో కలసి 'ఆక్సినోన్' సామానంతా వెదకసాగారు. అందులో ఓ కత్తి దొరికింది. ఇది ఎవరి కత్తి? అని అరిచాడు.

రక్తంతో తడిసిన ఆ కత్తిని చూసి భయపడిపోయాడు. ఈ కత్తిమీద నెత్తురు ఎలా వచ్చింది? అన్నాడు ఆఫీసరు. 'ఆక్సినోన్' జవాబు చెప్పాలని నోరు తెరిచాడు. కాని భయంతో వణికిపోతూ 'ఆ కత్తి నాదికాదు. నా సామానులోనికి ఎలా వచ్చిందో నాకు తెలియదు' అన్నాడు. ఈ ఉదయం ఆ వ్యాపారి గొంతు తెగిన శవం అయ్యాడు. అంతా నెత్తురుమయం. నీకొక్కడికే ఆ అనుకూలత ఉన్నది. ఆ సత్రం లోపల గడియ వేయబడి ఉన్నది. నీవు తప్పితే లోపల మరెవ్వరూ లేరు. ఇప్పుడేమో నెత్తుటి కత్తి నీ సామానులో ఉన్నది. ఇప్పుడు చెప్పు అతనినెలా చంపావు? ఎంత డబ్బు దొంగిలించావు? అన్నాడు.

అందుకు ఆక్సినోన్ ప్రమాణం చేశాడు. రాత్రి టీ త్రాగిన తర్వాత ఆ వ్యాపారిని అసలు చూడలేదన్నాడు. తన సొంత డబ్బు ఎనిమిది వేలు తప్ప తన దగ్గర ఇక డబ్బులు ఏవీ లేవన్నాడు. ఈ మాటలు చెప్పేటప్పుడు అతని ముఖం పాలిపోయింది. మాటలు తడబడ్డాయి. ఆ ఆఫీసరు ఆక్సినోన్‌ని బంధించి, తన బండిలో వెయ్యమన్నాడు. అతన్ని బంధించి బండిలో పడేశారు. ఆక్సినోల్ ఏడ్వడం ప్రారంభించాడు. అతని డబ్బు, బండి, గుఱ్ఱాలు మొత్తం వాళ్ళు తీసుకొని అతనిని దగ్గరలో ఉన్న పట్టణ చెరసాలలో వేశారు. అతని ప్రవర్తన గురించి అతని సొంత ఊరులో విచారించారు. పూర్వపు రోజుల్లో అయితే ఆక్సినోన్ త్రాగుతూ సమయాన్ని వృధా చేసేవాడు కాని ప్రస్తుతం అతడు చాలా మంచివాడని చెప్పారు. తర్వాత కోర్టులో కేసు నడిచింది. 'రెజోను' వ్యాపారిని హత్యచేసి ఇరవై వేల డబ్బు

దోచుకున్నాడని నేరం మోపబడింది. అతని భార్య నిరాశ చెందింది. ఏది నమ్మాలో, ఏది నమ్మకూడదో తెలియదు. ఆమెకు పాలు త్రాగే బిడ్డ ఉన్నాడు. మిగిలిన పిల్లలు కూడా చిన్నవారే. పిల్లలను తీసుకొని భర్త ఉన్న చెరసాల ఉన్న ఊరికి వెళ్ళింది. మొదట్లో ఆమెకు అనుమతి లభించలేదు. కాని చాలాసేపు బ్రతిమలాడిన తర్వాత ఆమెకు అనుమతి లభించింది. లోనికి వెళ్ళి – తన భర్త చెరసాల దుస్తులలో, దొంగలు, దోపిడిగాండ్ర మధ్య చూసి అదిరిపడి మూర్ఛబోయింది. చాలాసేపటి వరకు తేరుకోలేదు. ఇంటివద్ద విషయాలు అన్ని చెప్పి ఇప్పుడు నేనేమి చెయ్యాలి? అని అడిగింది.

ఏముంది, రాజుగారి దగ్గరకు వెళ్ళి ఒక అమాయకుని నాశనము నుండి తప్పించమని ప్రార్థించు చాలు అని చెప్పాడు.

నేను చక్రవర్తికి దరఖాస్తు చేశాను. కాని అది అంగీక రించబడలేదు అని చెప్పింది.

ఆక్సినోన్ ఏమి మాట్లాడకుండా నేలవైపు చూస్తు న్నాడు. అతని భార్య తన చేతి వ్రేళ్ళను భర్త తల వెంట్రుకలలో దూర్చి 'నేను ఆ రోజు నీకు చెప్పాను. నేను కల గన్నాను. ఇప్పుడు వెళ్ళవద్దని, కలలో నీ వెంట్రుకలు అన్నీ తెల్లగా అయిపోయాయి. నాకయినా చెప్పు నీవీ పని చెయ్యలేదని' అన్నది. 'నీవు కూడా నన్ను నమ్మటం లేదా?' అని ఆక్సినోన్ ఏడ్వడం మొదలుపెట్టాడు. అప్పుడు ఓ సిపాయి వచ్చి ఇకమీరు బయటకు వెళ్ళాలి అని తొందరచేశాడు. ఆక్సినోన్ భార్య – పిల్లలను తీసుకొని వెళ్ళిపోయింది. వారు వెళ్ళిపోయిన తర్వాత ఆక్సినోన్ బాధపడ్డాడు. తన భార్య కూడా తనను అనుమా నించింది. కాబట్టి ఇక ఏ మానవుని యందు న్యాయము కొరకు ఆశపడకూడదు. దేవునికి నిజం తెలుసు. కాబట్టి దయా దాక్షిణ్యాలు ఆయన దగ్గర నుండే పొందాలి. ఆయననే సహాయం అడగాలి అనుకొన్నాడు ఆక్సినోన్.

అప్పటినుండి ఆక్సినోన్ ఎవరికి ఎటువంటి అప్పీలు చేసుకోలేదు. అతని దండించి 'గనులలో' పనిచేయుటకు పంపబడ్డాడు. కనుక అతనిని కొరడాలతో కొట్టి ఆ గాయాలు మానిన తర్వాత మిగిలిన నేరస్తులతో సైబీరియాలో ఉన్న గనులలో పనిచేయుటకు పంపబడ్డాడు. ఇరవై ఆరు సంవత్సరాలు ఆ గనులలో నేరస్తునిగా పనిచేసాడు. అతని వెంట్రుకలు తెల్లబడ్డాయి. గడ్డం పొడవుగా పెరిగిన అతనిలో సంతోషము అంతాపోయింది. నిదానంగా నడిచేవాడు. అతను ఎప్పుడు నవ్వలేదు కాని ఎక్కువగా ప్రార్థిస్తుండేవాడు. చెరసాలలో చెప్పులు కుట్టడం నేర్చుకున్నాడు. కొద్దిగా డబ్బులు వస్తే ఆ డబ్బుతో భక్తుల జీవితచరిత్రలు కొనేవాడు. చెరసాలలో చదవగలిగిన వెలుతురు ఉన్నప్పుడు ఆ పుస్తకాలు చదివేవాడు. ఆదివారాలు చెరసాలలో ఉన్న చర్చికి వెళ్ళేవాడు. వాక్యము చదివేవాడు. చక్కని గొంతుతో పాటలు పాడేవాడు. చెరసాల అధికారులు అతని ప్రవర్తనను చూచి ఇష్టపడేవారు. తోటి ఖైదీలు అతని గౌరవించేవారు. అతనిని 'తాత' అని కాని, 'పరిశుద్ధుడు' అనిగాని పిలిచేవారు. ఖైదీలకు ఏదైనా ఇబ్బంది కలిగినపుడు అధికారులు మాట్లాడటానికి ఆక్సినోన్‌ని పంపించేవారు. వారిలో వారికి తగాదాలు కలిగితే ఆక్సినోన్ దగ్గర న్యాయం కోసం వచ్చేవారు.

అతని ఇంటి వద్దనుండి అతనికి ఎటువంటి సమాచారము లేదు. తన భార్య పిల్లలు ఇంకా జీవించి ఉన్నారో లేదో కూడా ఇతనికి తెలియదు. ఒకరోజు కొత్తగా ఒక గుంపు ఖైదీలు చెరసాలకు వచ్చారు. పాత ఖైదీలు వారి చుట్టూ చేరి వారు ఏ పట్టణాలు, గ్రామాల నుండి వచ్చారో అడుగుచుండే వారు. వారు ఏ కారణాల వల్ల ఖైదీ అయ్యారో అడిగేవారు. వాళ్ళు చెప్పుకునే మాటలను ఆక్సినోన్ తల వాల్చి వింటుండే వాడు. అలా వచ్చినవారిలో అరవై సంవత్సరాల పొడవైన బలమైన వ్యక్తి ఉన్నాడు. తెల్లని వెంట్రుకలతో నున్నగా దువ్వుకొని తను ఎందుకు ఈ శిక్ష అనుభవించవలసినదో చెప్పసాగాడు.

'నేను బండికి కట్టబడివున్న గుఱ్ఱాన్ని తీసుకొన్నాను. నన్ను అరెస్టు చేశారు. దొంగిలించానన్నారు. 'నేను దీనిమీద తొందరగా ఇంటికి వెళ్ళి దీన్ని వదిలేస్తా, తిరిగివస్తుంది కదా అనుకొన్నాను' అన్నాను. ఆ బండి అతను నా స్నేహితుడు అన్నాను. నువ్వు దొంగతనము చేశావు అన్నారు. కాని నేను ఎక్కడ ఎప్పుడు దొంగతనము చేసినా వాళ్ళు పట్టించుకోలేదు. అయితే చాలాకాలం క్రితం నేను పెద్ద ఘోరం చేశాను. ఆ రోజు నన్ను పట్టించుకోలేదు. అప్పుడు నిజానికి నాకీ శిక్ష పడవలసింది. నేను సైబేరియాకి సంబంధించిన వాడినే కాని నేను అక్కడ జీవించలేదు అన్నాడు. అయితే నువ్వు ఎక్కడనుండి వచ్చావు? అన్నాడు. నేను వాడమీర్ వాడిని. నాకుటుంబము అక్కడే ఉన్నది. నా పేరు మేకర్ కాని, నన్ను అందరు 'సెమినిక్' అంటారు. అప్పుడు ఆక్సినోన్ తల పైకెత్తి సెమినిక్ నీకు ఆక్సినోన్ అనే వాడమీర్ వ్యాపారి తెలుసా? అని అడిగాడు. వాళ్ళు ఇంకా జీవించి ఉన్నారా? అన్నాడు.

తెలుసును. ఆక్సినోన్ చాలా ధనవంతులు. ఇప్పుడు వారి తండ్రి సైబీరియాలో ఉన్నాడు. మనలాగానే అతను ఓ పాపి అని, తాత! నీకు వాళ్ళెలా తెలుసు? నీవు ఇక్కడికి ఎందుకు

వచ్చావు? అన్నాడు.

ఆక్సినోన్ తన కథ చెప్పదలచుకోలేదు. ఒకసారి నిట్టూర్చి నా పాపాలకి నేను శిక్ష అనుభవిస్తున్నాను. గత ఇరవై ఆరుసంవత్సరాలుగా... అన్నాడు.

ఏ పాపముచేశావు? అన్నాడు మేకర్.

ఆక్సినోన్ – సరేలే! వీటికి నేను అర్హుడనే అన్నాడు. కాని తోటి ఖైదీలు ఆక్సినోన్ ఏవిధంగా ఈ చెరసాలకు వచ్చాడో చెప్పారు. ఎవరో ఒకరు ఒక వ్యాపారిని చంపి, ఆ కత్తి ఆక్సినోన్ సంచిలో పెట్టినందువలన నిర్దోషి అయిన ఆక్సినోన్ అన్యాయపు శిక్ష అనుభవిస్తున్నాడన్నారు. వెంటనే మేకర్ ఆక్సినోన్ వైపు చూచి ఇది చాలా ఆశ్చర్యం. నిజంగా ఆశ్చర్యం. ఇప్పుడు నీవెంత పెద్దవాడవయ్యావు అన్నాడు.

మిగిలిన వారన్నారు – నువ్వు ఎందుకు ఇంతగా ఆశ్చర్యపోతున్నావు? ఇంతకుముందు నువ్వు ఆక్సినోన్‌ని ఎక్కడ చూచావు? అని అడిగాడు. కాని అతను జవాబు చెప్పకుండా మనిద్దరం ఇక్కడ ఈ విధంగా కలుసుకోవడం ఆశ్చర్యం అన్నాడు. ఒకవేళ నువ్వు ఈ కథంతా వినివుంటావు. లేకపోతే ఇంతకు ముందు నన్ను చూచివుంటావు అన్నాడు ఆక్సినోన్. నేనెలా వింటాను? ఈ జగతిఅంతా కట్టు కథలతో నిండివున్నది. అయినా ఇది జరిగి చాలా కాలమయింది కదా! అన్నాడు. ఆ వ్యాపారిని ఎవరు చంపారో నీకు తెలిసి వుంటుంది అన్నాడు ఆక్సినోన్. అందుకు మేకర్ పెద్దగా నవ్వి ఆ కత్తి ఎవరి సంచిలో ఉందో వానికి తప్ప అతనిని చంపినదెవరో ఎవరికి తెలుస్తుంది? అతను పట్టుబడే అంతవరకు అతను దొంగకాడు. అయినా ఎవరయినా తల క్రింద ఉన్నసంచిలో కత్తిని ఎలా పెట్టగలరు. అలా పెడుతుంటే మెళకువరాదా? అన్నాడు.

అప్పుడు ఆక్సినోన్‌కి అర్థమయింది. ఆ వ్యాపారిని చంపింది మేకరేనని. అక్కడనుండి లేచి వెళ్ళిపోయాడు. ఆ రాత్రంతా ఆక్సినోన్ నిద్రపోలేదు. అన్ని రకాల ఆలోచనలతో అల్లాడిపోయాడు. చిన్నబిడ్డను చంకనబెట్టుకొని ప్రక్కన పెద్దకొడుకుతో తన భార్య నిలుచుంటే తను సంతకి బయలు దేరటం గుర్తొచ్చింది. తను గిటార్‌తో చక్కగా పాటలు పాడుతూ కేరింతలు కొట్టేవాడు. తనను అరెస్టు చెయ్యడం, కొరడాలతో కొట్టడం, జనులంతా చుట్టూ మూగివుండడం, ఇరవై ఆరు సంవత్సరాల చెరసాల జీవితం, అంతా ఆలోచనలతో అల్లాడి పోయాడు. చనిపోవాలనుకున్నాడు.

తరువాత తన శత్రువైన మేకర్‌ని చంపాలనుకున్నాడు. ఒకవేళ తను చనిపోవాల్సి వచ్చినా పగతీర్చుకోవాలనుకున్నాడు. రాత్రంతా ప్రార్థిస్తూనే ఉన్నాడు. పగటి సమయంలో మేకర్‌కి కనబడకుండా ఉన్నాడు. ఒకరాత్రి ఆక్సినోన్ నిద్రపోలేదు. ఏమి చెయ్యాలో తోచలేదు. ఆ రాత్రి అతను చెరసాలలో నడుస్తుంటే కొంత మట్టి – ఖైదీలు పండుకొనిన స్థలమునుండి రావడం చూశాడు. అతను నిలబడ్డాడు. మేకర్ అక్కడవున్న ఓ బీరువా ప్రక్కన గుంటలోనుండి పైకి ఆక్సినోన్‌ను చూచి అదిరిపోయాడు. వెంటనే అక్కడనుండి కదిలిపోతుంటే మేకర్ వచ్చి అతని చేతులు పట్టుకొని మనం పారిపోవడానికి ఓ సొరంగము లాంటిది త్రవ్వుతున్నాను. త్రవ్విన మట్టిని నా పొడుగు బూట్లలో చేర్చి పగలు పనికి వెళ్ళినపుడు పడేస్తున్నాను. ఈ సంగతి ఎవరికి చెప్పవద్దు. నువ్వు కూడ తప్పించుకొని పోవచ్చు. ఒకవేళ ఏమయినా వాగావంటే నిన్ను చంపేస్తాను అన్నాడు.

ఆక్సినోన్ కోపంతో ఊగిపోయాడు. తన చేతిని ప్రక్కకు లాగి నాకు ఇక్కడనుండి పారిపోయే ఉద్దేశ్యము లేదు. నువ్వు నన్ను ఇంతకుముందే చంపేశావు. అయితే నీవు ఒకటి తెలుసుకో! నేనేమి చేసినా అది దేవుని నడిపింపు ప్రకారం జరుగుతుంది అన్నాడు. మరునాడు ఖైదీలను బయటకు నడిపిస్తున్న ఓ సైనికుడు ఎవరో ఒక ఖైదీ తన బూట్లనుండి మట్టిని తెచ్చి బయట పడవేసినట్లు గమనించాడు. ఆ చెరసాలను పరీక్షించినపుడు సొరంగము ఒకటి కనబడింది. గవర్నరు వచ్చి ఖైదీలను ప్రశ్నించాడు. అందరూ మేమెరుగము అన్నారు. తెలిసినవారు కూడా మేకర్‌ని చచ్చేంతవరకు కొరడాలతో కొడతారని చెప్పలేదు. చివరికి గవర్నరు ఆక్సినోన్ వైపు చూచి నీవు నిజాయితీపరుడవు. దేవుని మీద ఆనపెడుతున్నాను, నువ్వు నిజం చెప్పు అన్నాడు.

ఆక్సినోన్ ఏమి పట్టనివానివలె చూచాడు. అతని చేతులు పెదాలు వణుకుతున్నాయి. చాలాసేపటివరకు ఒక్క మాట అయినా పలుకకుండా నిలుచున్నాడు. ఆలోచిస్తున్నాడు. నా జీవితం నాశనము చేసిన వానిని నేనెందుకు కాపాడాలి? నేను నిజం చెబితే అతను మరణించేవరకు కొరడాలతో కొడతారు. నేనతని గురించి అనుకొన్నది నిజమో, కాదో కదా? నిజం చెబితే నాకేంటి లాభం?

చెప్పు పెద్దాయన. ఈ సొరంగము త్రవ్వుతున్నది ఎవరు? అని గవర్నరు అడిగాడు.

నేను చెప్పలేను యువర్ ఆనర్! నేనతని గురించి చెప్పడం దేవుని చిత్తంకాదు. నేను మీ చేతిలో ఉన్నాను. నన్ను మీ ఇష్టం వచ్చినట్లు చేయండి అన్నాడు. గవర్నరు అతనిని

**తరువాయి భాగం 23వ పేజీలో**

సీరియల్

# వాక్యంలోని వనితలు

4

- శ్రీమతి మెర్సీ ఇశ్రాయేలు

**యొకెబెదు :-** యొకెబెదు పేరు పరిశుద్ధ గ్రంథంలో రెండుసార్లు మాత్రం వుంది. (నిర్గమ 6:20, సంఖ్య 26:59) యొకెబెదు లేవీ కుమార్తె. ఆమె భర్తపేరు అమ్రాము. ఇశ్రాయేలీయులను ఐగుప్తు చెరనుండి విడిపించి నడిపించిన గొప్ప నాయకుడైన మోషేకు తల్లి - యొకెబెదు. ఆమెకు మోషే కంటే ముందుగా మిర్యాము అను ఒక కుమార్తె, అహరోను అను ఒక కుమారుడు ఉన్నారు. ఆమె మోషేను కనిన దినాల్లో ఫరో కఠినమైన శాసనం ఒకటి అమల్లో వుంది. అది హెబ్రీ స్త్రీలకు పుట్టిన ప్రతి మగపిల్లను చంపాలనే ఆజ్ఞ (నిర్గమ 1:16)

మంత్రసానులైన షిఫ్రా, పూయా దేవునికి భయపడి పుట్టిన మగ శిశువులను బ్రతుకనియ్యగా హెబ్రీయులలో పుట్టిన ప్రతి కుమారుని నదిలో పారవేయమనే మరొక ఆజ్ఞ ఇవ్వబడింది (నిర్గమ 1:22). అప్పుడే, ఆ భయంకరమైన కాలంలోనే యొకెబెదుకు మోషే పుట్టాడు.

యొకెబెదు ఈ భయంకరమైన పరిస్థితిలో తన చిన్న కుమారుని కొరకు యెన్ని కష్టాలు పడిందో ఊహించడం కష్టం. సైనికుల కంటబడ్డ చంటిబిడ్డని తల్లుల చేతుల్లోనుండి బలవంతంగా లాక్కొని చంపుతుంటే, నరుకుతుంటే చిన్న బిడ్డల ఏడుపులూ, తల్లుల ఆక్రందనలూ వింటూ గడిపిన భయంకర క్షణాల్లో తన బిడ్డ ప్రాణం కాపాడుకోవడానికి ఆమె చేసిన ప్రయత్నాలెన్నో వుండి వుంటాయి. సామానుల గదుల్లోను, వంట యింటి గిన్నెల్లోను దాచిపెట్టిందేమో! నిద్రలేని రాత్రులెన్ని గడిపిందో! రేయి మొదటిజామునే (విలాప 2:17) కాక రేయంతా మేల్కొని ప్రార్థించిందేమో! మూడు నెలలకే గొంతు పెంచిన తన కొడుకుని ఇక దాచిపెట్టలేని పరిస్థితిలో దేవుని మీద సంపూర్తిగా భారంపెట్టి, విశ్వాసంతో ఒక జమ్ముపెట్టె తీసుకొని దానికి జిగట మన్నును, కీలును పూసి అందులో ఆ పిల్లవానిని పెట్టి ఏటి ఒడ్డున జమ్ములో దానిని వుంచింది. (నిర్గ 2:3) ఏమి జరుగుతుందో చూడ్డానికి వాని అక్క మిర్యామును అక్కడ ఉంచింది. యొకెబెదు నిరంతర ప్రార్థన, ధృడమైన విశ్వాసం, ధైర్యం ఈ సాహసానికి ముందడుగు వేయించింది. ఎవరైనా చూసి అక్కడే చంపేస్తారేమో అనే సందేహం, భయాందోళనలు ఆమెను బాధ పెట్టలేదేమో! ఆమె విశ్వాస సహితమైన ప్రార్థనలే ఆమెకు బలం. అందుకే అంత ధైర్యంగా తన ముద్దుల కుమారుని నీళ్ళల్లో వదిలేయగలిగింది. ఆమె ప్రార్థనలు ఫలించి, ఆమె విశ్వాసం బలపడి ఆ కుమారుడు ఫరో కుమార్తె అయిన యువరాణి కంటిలోపడ్డాడు. అంతేకాదు "హెబ్రీ స్త్రీలలో ఒక దాదిని పిలుచుకొని వత్తునా" అని మిర్యాము అడిగినపుడు తన తల్లినే పిలుచుకొని వచ్చింది. యొకెబెదుకు ఆ బిడ్డను అప్పగించి, "నాకొరకు ఈ బిడ్డను పాలిచ్చి పెంచుము" అని ఆ యువరాణి అనినపుడు తనే ఆ బిడ్డకు తల్లినని తెలియకుండా జాగ్రత్తపడి తన కుమారుని తన కౌగిట్లో చేర్చుకుంది.

అమితానందంతో తన బిడ్డను తన గుండెలకు హత్తుకొని ఇంటికి తీసుకొనిపోయి ఉండవచ్చు. తను నమ్మిన దేవుడు నమ్మదగినవాడని, ఆయనను నమ్మినవారిని ఎన్నడు సిగ్గుపరచడని అనుభవపూర్వకంగా తెలుసుకున్న ఆ తల్లి ఎంతో ఆనందంతో దేవుని స్తుతించి వుండవచ్చు.

ప్రార్థించి సాధించిన తల్లి విశ్వాస జీవితం అహరోను, మిర్యాములు చూస్తూనే ఉన్నారు. అప్పటికి మిర్యాముకు ఏడు సంవత్సరాలు అహరోనుకు మూడు సంవత్సరాలని ఇతర గ్రంథాల నుండి తెలుసుకోవచ్చు. అంత చిన్న వయసునుండే తల్లినుండి నేర్చుకున్న పాఠాలు వారిలో బాగా హత్తుకొని పోయాయి. ఇప్పుడు మోషే కూడా తల్లి ఒడికే చేరి ఉగ్గుపాలతోనే నేర్చుకొంటున్నాడు. ఏ తల్లి అయినా తన బిడ్డలకు తనలోని గుణగణాలనే నూరిపోయగలదు. అవి మాత్రమే వారిలో ఇమిడిపోగలవు. అంతకంటే అధికంగా ఆమె ఏమీ చేయలేదు. యొకెబెదు అదే చేయగలిగింది. అంత మంచి గుణాలు కలిగిన తల్లిని కలిగి ఉండడం ఈ బిడ్డలకు ఎంత ఆశీర్వాదకరం! ఆమెలోని విశ్వాసం, ప్రేమ, పట్టుదల, ధైర్యం, ఓర్పు, చురుకుదనం చిన్నతనం నుండే బిడ్డలు నేర్చుకుంటూ వున్నారు.

అందుకే వారు ముగ్గురూ దేవుని సేవకులైనారు. ఎవరో ఒకరిని దేవుని సేవకు ఇవ్వాలని ఆమె తలంచలేదు. తన బిడ్డలు ముగ్గురూ ఆయన సేవకే అంకితమగునట్లు సంపూర్ణ సమర్పణ కలిగినవారుగా వుండునట్లు తన నడవడినే సరిచేసుకుంది. దేవుడే వారి విశ్వాస సమర్పణలను చూచి ఏర్పాటు చేసుకొన్నాడు. "మిమ్మును నడిపించుటకై మోషే, అహరోను మిర్యాములను పంపించితిని", మీకా 6:4లో చెప్తున్నాడు.

జమ్ము పెట్టెలో దొరికిన బిడ్డను చూచి వీడు హెబ్రీయులలో ఒకడని ఫరో కుమార్తె చెప్పగానే (2:6) నీకొరకు ఈ

పిల్లవాని పెంచుటకు నేను వెళ్ళి హెబ్రీస్త్రీలలో ఒక దానిని పిలుచుకొని వత్తునా? (2:7) అని యువరాణితో ఏడేళ్ళ మిర్యాము అడగడం విచిత్రంగానే ఉంది.

అది ఆమెకు తల్లి ద్వారా వచ్చిన ధైర్యమూ, విశ్వాసమూ ఇశ్రాయేలీయులను నడిపించుటలో మోషే, అహరోనులకు ఎంతో సహాయకారిగా, ప్రవక్తిగా ఉండి తంబురను, చేతపట్టుకొని స్త్రీలందరు తంబుర తోను నాట్యముతోను, పాటలుపాడుచు నడిపించిన స్త్రీ మిర్యాము (నిర్గ 15:20). తన ప్రజలను శత్రువుల నుండి రక్షించి సముద్రమును పాయలుగా చేసి ఆరిననేలపై నడిపించిన దేవుని స్తుతించి ఘనపరచింది - ఇంత భక్తి, విశ్వాసమూ, త్యాగమూ తల్లి వలన అలవడిన వనుటలో సందేహం ఏముంది?

ఇశ్రాయేలీయులను నడిపించిన గొప్ప నాయకుడు మోషే! అయినా మోషే నత్తివాడైనందున అహరోను మోషే నోటికి నోరుగా నుండి మోషేకు బదులుగా జనులతో మాటలాడి వారిని నడిపించాడు.

"నేను నీ నోటికి, అతని నోటికి తోడైయుండి మీరు చేయవలసిన దానిని బోధింతును" అని యెహోనా సెలవిచ్చెను (నిర్గమ 4:15).

యెహోవా - మోషేను ఎదుర్కొనుటకు అరణ్యము లోనికి వెళ్ళుమని అహరోనుతోచెప్పగా అతడు వెళ్ళి దేవుని పర్వతమందు అతని కలుసుకొని అతని ముద్దు పెట్టుకొనెను (4:27)

అపుడు మోషే యెహోవా చెప్పినదంతయు అహరోనుకు చెప్పాడు. అహరోను కర్రను పడవేయగానే అది సర్పమాయెను (నిర్గ 7:10)

అహరోను ఐగుప్తు జలములమీద తనచెయ్యి చాపెను. అప్పుడు కప్పలు ఎక్కి వచ్చి ఐగుప్తు దేశమును కప్పెను (8:6).

అహరోను తన కర్రను పట్టుకొని చెయ్యి చాపి ఆ దేశపు ధూళిని కొట్టినపుడు పేలు మనుష్యుల మీదను జంతువుల మీదను ఉండెను (8:17)

ఈలాగు చాలా అద్భుతాలు అహరోను ద్వారానే జరిగాయి. కోరహు, దాతాను, అబీరాములు అహరోను యాజకత్వానికి వ్యతికేరముగా మాట్లాడినపుడు యెహోవా అహరోను యాజకత్వమును స్థిరపరిచాడు. దానికి సూచనగా అహరోను కర్ర చిగిర్చి, పువ్వులు పూచి, బాదము పండ్లు గలదాయెను. అది శాసనముల యెదుట నుంచబడింది (హెబ్రి 9:4). చిగురించిన అహరోను చేతికర్ర మందసములో నుంచబడి నట్లు కనబడుతూ ఉంది. ఇంతగా దేవుడు ఏర్పరచుకొనిన అహరోను భక్తి విశ్వాసములు చిన్నతనము నుండి తన తల్లి దగ్గరనుండి నేర్చుకొనినవే! ఇక మోషే ఇశ్రాయేలీయులను ఐగుప్తు చెర నుండి విడిపించి వాగ్దాన భూమిలోనికి నడిపించాడు. ఇశ్రాయేలీయుల సణుగులు, విసుగులు సహించి దేవునితో ముఖాముఖిగా మాట్లాడుచు దేవుని చిత్త ప్రకారం వారిని సంతృప్తి పరుస్తూ నడిపించాడు.

యెహోవా ఇల్లంతటిలో నమ్మకమైన వాడని (సంఖ్యా 2:7) యెహోవాయే సెలవిచ్చెను. యెహోవా అతనితో ముఖాముఖిగా మాట్లాడి దేవుని మహిమను చూచినవాడు. మోషే భూమిమీదనున్న వారందరిలో సాత్వికుడు యెహోవా ఆయనను గూర్చి సెలవిచ్చాడు. (సంఖ్యా 12:3) ఇతడు మొదటే అన్యాయాన్ని సహించలేని జాలిగుండె గలిగి పొరుగువారు పోట్లాడుకోవడం చూడలేకపోయాడు. (నిర్గ 2:11) మిద్యాను యాజకుని కుమార్తెలు మందకు నీళ్ళుపెట్టాలని నీళ్ళు చేది తొట్లను నింపుకుంటూ వుంటే మందకాపరులు వచ్చి వారిని తోలివేశారు. అప్పుడు మోషే లేచి వారికి సహాయము చేశాడు. (నిర్గమ 2:16,17)

అతని విశ్వాసమును బట్టి ఐగుప్తు ధనముకంటే క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని ఎంచుకొని, అల్పకాలము పాపభోగము అనుభవించుట కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించాడు (హెబ్రి 11:24-29). ఎర్ర సముద్రమును పాయలుగాచేసి ఆరిననేలపై ఇశ్రాయేలీయులను నడిపించాడు. దేవునితో మాట్లాడుతూ ఎన్నో అద్భుతాలను చేయగలిగాడు. బండనుండి నీళ్ళు, ఆకాశమునుండి మన్నాను కురిపించాడు. ఇన్ని అద్భుతాలను చేయగలిగిన భక్తి విశ్వాసాలు మోషేకు తన తల్లినుండి ప్రాప్తించినవే కదా!

ఇలాంటి గొప్ప వనితలను గూర్చి వాక్యములో వ్రాయబడియుండగా మనము వాటిని పఠించి, ధ్యానించి అనుసరించడం ఎంతో ప్రాముఖ్యం. యోకెబెదు బిడ్డలు ముగ్గురూ దేవుని సేవలోనే ఉండగలిగే ఆశ, ఆసక్తి - తల్లి విశ్వాస ప్రార్థనా జీవితమే అని మనకు బాగా తెలుస్తూవుంది. యోకెబెదు లాంటి జ్ఞానమూ, చురుకుదనమూ, ధైర్యమూ, విశ్వాసమూ, ప్రార్థనా జీవితము అనుగ్రహించుటన్లు పరిశుద్ధాత్మ దేవుడు ప్రతి తల్లికీ సహాయము చేయునుగాక!

# సువార్తలలోని యేసు కథ



యేసుప్రభువు రాకడ విషయంలో మానవులకు రక్షణ ఎప్పుడు చేరువనే ఉన్నది. అందరు రక్షించబడాలన్నది ప్రభువు ఉద్దేశ్యము. ఏ ఒక్కరు నరకములో పడకూడదు. అసలు నరకము మనుష్యుల కొరకు చెయ్యలేదు. అది సాతానుకును, వాని దూతలకును తయారుచేయబడినది.

మన జీవితము ముగింపు నరకము కాదు. ఏర్పరచబడిన వారు యేసును ప్రేమిస్తే వారికి ఈ లోకములో ఉన్న ఆస్థి మీద అసలు ధ్యాసవుండదు. దూతలచే రక్షించబడి నప్పటికి లోతు భార్య మనసు, తనువు కూడబెట్టిన వాటిపైనే ఉన్నది. ఆమె మనసు ఆమెతో రక్షణలోనికి రాలేదు కనుక ఆమె కూడా తన కుటుంబముతో నడవలేకపోయింది.

కాబట్టి లోతు భార్యను జ్ఞాపకము చేసుకొనుము అని – తన ప్రాణమును రక్షించుకొనగోరువారు దానిని పోగొట్టుకొనును, దాని పోగొట్టుకొనువాడు దానిని సజీవము గా కాపాడుకొనును అన్నాడు.

ఇంటిలోనయినా పొలములోనయినా రక్షింప బడినవారు రక్షించబడనివారు కలసి జీవిస్తారు. దేవుని పిలుపు అందరు వింటారు. కాని దేవుని చెంతకు చేరే పొలములోనివాడు పొలమునుండి, మిద్దెమీద ఉన్నవాడు క్రిందకి రావడానికి వీలు ఉండదు అన్నాడు.

పేతురు – ఇది ఎక్కడ జరుగుతుంది? అన్నాడు. యేసు పిలుపు విని ఒక శిష్యుడు ప్రభువా! నేను వెళ్ళి నా తండ్రిని పాతిపెట్టి రావడానికి అనుమతివ్వండి అన్నాడు. అందుకు ప్రభువు మృతులు తమ మృతులను పాతిపెట్టుకొన నిమ్ము. నీవు వెళ్ళి దేవుని రాజ్యమును ప్రకటించుము అన్నాడు. రాకడ విషయం భయపడేవారు మృతులు – పీనుగు ఎక్కడ ఉన్నదో అక్కడ గద్దలు పోగవును అని అన్నాడు. ఎక్కడ జరిగినా మృతులు గుంపులో మృతులే ఉంటారు. ఈయన దేవుని రాజ్యము సమీపించి ఉన్నది, అందరు మారుమనస్సు పొందమని చెబుతుంటాడు. ఆ పరలోక రాజ్యము సమీపముగా ఉంటే ఎందుకు కంటికి కనపడదు. అసలు అంత ఆలస్యము ఎందుకు అవుతుంది అని యూదులు యేసుమీద సణుగుతుంటారు. ఇశ్రాయేలీ యుల ప్రార్ధన దేవుడు ఆలకించడం లేదు అని అంటుం టారు. ఈయన నిజమైన మెస్సయ్య కాదేమో అని అనుమాన పడుతుంటే...

అందుకు యేసు ప్రభువు వారికి ఓ కథ చెప్పాడు. ఒకానొక పట్టణములో ఒక న్యాయాధిపతి ఉన్నాడు. అతను దేవునికి భయపడలేదు. మనుష్యులను లక్ష్యపెట్టలేదు. ప్రజాస్వామ్యములోనే ఇలా ఉంటే నాటిరోజుల్లో పరిపాల నంతా డబ్బులోనే గడిచేది. డబ్బున్నవాడే న్యాయాధిపతి. ఆ పట్టణంలో ఓ విధవరాలు ఉంది. ఆమెకు అన్యాయం జరిగింది. కనుక న్యాయం కొరకు న్యాయాధిపతి దగ్గరకు వెళ్తే అతను పట్టించుకోలేదు. కాని ఆమె దగ్గర ఒకే ఆయుధం – ఓర్పు, సహనము ఉన్నాయి. తనకు న్యాయము జరిగేంత వరకు న్యాయాధిపతిని విడిచిపెట్టలేదు. ఆమె తరపున వాదించేవారెవరు లేరు. కనుక ఆమె మాటిమాటికి స్వయముగా న్యాయాధిపతిని కలుస్తుంది. న్యాయాధిపతి వాయిదాలు వేస్తున్నాడు. ఆమె నిరుత్సాహపడలేదు. రోజులు గడిచిపోతున్నాయి.

తన ఓర్పుతో ఆమె న్యాయాధిపతిని జయించింది. అతను నేను దేవునికి భయపడకయు, మనుష్యులను లక్ష్య పెట్టకయు ఉండినను, ఈ విధవరాలు నన్ను తొందర పెట్టు చున్నది. గనుక మాటిమాటికి వచ్చి నన్ను గోజాడకుండు నట్లు ఆమెకు న్యాయము తీర్చునని అనుకొన్నాడు. అన్యాయస్థుడైన ఆ న్యాయాధిపతి చెప్పినది వినుడి అన్నాడు ప్రభువు.

దేవుడు తాను ఏర్పరచుకొనిన వారు దివారాత్రులు తన్ను గూర్చి మొఱ్ఱపెట్టుచుండగా వారికి న్యాయము తీర్చడా? అన్నాడు. కాని కొన్నిసార్లు ఆలస్యం అవుతుంది జవాబు రావడానికి. మన భవిష్యత్తు మనకు తెలియదు. ఒకసారి మనకు మంచి చేస్తాయి అని డబ్బు అడుగుతాము.

నిజంగా మనం అడిగిన డబ్బు దేవుని నుండి మనలను దూరం చేస్తుందని ఆయనకు తెలుసు. మనకంటే మన దేవునికి మన సంగతులు చాలా తెలుసు. కనుక దేవుడు మనకు, మన ప్రార్ధనకు జవాబు ఇవ్వలేదంటే మన మంచికని మనం తెలుసుకోవాలి.

చిన్నపిల్లలు అడిగినవన్నీ వారికి మనం ఇవ్వం. ఎందుకు? వారిని ప్రేమించే మనకు – వారికి ఏది అవసరమో, ఏది మేలో, ఏది కీడో తెలుసును.

అదేవిధంగా దేవుడు మన తండ్రి కనుక ఆయన మనకేది అవసరమో అది సరయిన సమయములో మనకు ఇస్తాడు అని మనం నమ్మాలి. అదే విశ్వాసము అంటే!

సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనమై యున్నది అని పౌలుగారు చెప్పారు. మీరు చెడ్డవారై యుండియు, మీ పిల్లలకు మంచి ఈవులనియ్య నెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటే ఎంతో నిశ్చయముగా మంచి ఈవులనిచ్చును.

దేవుడు తాను ఏర్పరచుకొనిన వారు దివారాత్రులు తన్ను గూర్చి మొరపెట్టుకొనుచుండగా వారికి న్యాయము తీర్చడా? ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును. వారి విషయమే కదా ఆయన దీర్ఘశాంతము చూపుచున్నాడు. దేవుడు తాను ఏర్పరచుకొనిన వారు దివారాత్రులు తన్నుగూర్చి మొర పెట్టుకొనుచుండగా వారికి న్యాయము తీర్చడా? ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును. వారి విషయమే కదా ఆయన దీర్ఘశాంతము చూపుచున్నాడు.

ఈ లోకసంబంధమైన న్యాయాధిపతులు ప్రజలు తమ యొద్దకు మాటిమాటికి రావడానికి ఇష్టపడరు. కాని పరలోక న్యాయాధిపతి మనము ఎన్నిసార్లు ఆయన దగ్గరకు వెళ్తామో అంతగా సంతోషిస్తాడు. అయితే మనం ఆయనను ఏమి అడగాలో ఏమి అడుగకూడదో కూడా నేర్పిస్తాడు. సలోమి తన పిల్లల భవిష్యత్తు ఇతరుల కంటే గొప్పగా ఉండాలని కోరుకొన్నది.

ఆయన దగ్గరకి వచ్చి అడిగింది. మిగిలిన శిష్యుల సంగతి ఏమోకాని, నా బిడ్డలిద్దరిని నీ రాజ్యమందు ఈ నాయిద్దరు కుమారులలో ఒకడు నీ కుడివైపునను ఒకడు నీ ఎడమవైపునను కూర్చుండనిమ్మని అడిగింది.

అందుకు యేసు – మీరేమి అడుగుచున్నారో అది మీదు తెలియదు అన్నాడు. అలాగే మనం చాలాసార్లు మనము ఆయనను ఏమి అడుగుచున్నామో మనకు తెలియదు. ఆ సలోమి ఆమె తన కోరిక ఆయనతో చెప్పింది. నేను త్రాగబోవు గిన్నెలోనిది మీరు త్రాగుతారా? అన్నాడు. త్రాగగలమన్నారు. అందువలన యాకోబు ఆయన శిష్యులలో మొదటి హతసాక్షి అయ్యాడు.

చాలాసార్లు ప్రభువు బిడ్డలు – సాతాను మమ్ములను బహుగా శోధిస్తున్నాడని వాపోతారు. నిజానికి ప్రభువు బిడ్డల మీద సాతానుకు ఎటువంటి అధికారము లేదు.

ప్రభువే సాతానును పురిగొల్పి యోబును శోధనలోకి పంపించాడు. ఎందుకంటే యోబును ఇప్పుడున్న దానికంటే మరి ఎక్కువగా ఆశీర్వదించాలని అనుకొన్నాడు. కాని అతని ఆత్మీయస్థితి అంత హెచ్చుగా లేదు. అందువలన ఒక సంవత్సరం అతని బహుగా కృంగదీసిన తరువాత వినికిడి ద్వారా నిన్ను గూర్చిన వార్త నేను వింటిని, అయితే ఇప్పుడు నేను కన్నులారా నిన్ను చూచుచున్నాను. కావున నన్ను నేను అసహ్యించుకొని ధూళిలోను బూడిదలోను పడి పశ్చాత్తాపపడుచున్నాను అన్నాడు యోబు.

అలా ప్రభువు స్వరూప స్వభావమును యోబుకు చూపించడానికి కన్నులారా ఆయనను చూచుటకు యోబుకు ఆత్మీయశక్తి కలగటానికి దేవుడు ఆయనను ఒక సంవత్సరం శోధనలో ఉంచాడు.

**ప్రసంగములు పత్రికలో ప్రచురణ కొరకు పంపవద్దు**

North East West South వార్తలు

# క్రైస్తవ వేదాంత కళాశాలకు (UTC)అరుదైన గౌరవం

**కర్ణాటక :** శతాబ్దపు కాలపు చరిత్ర కలిగిన "యునైటెడ్ థియోలాజికల్ కాలేజి" ( UTC ) కి తగిన గుర్తింపుగా కర్ణాటక తపాలా శాఖ 5రూ. పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది.

వివరాలలోనికి వెళితే జూలై, 1910లో వివిధ క్రైస్తవ సువార్త సేవా పరిచర్యల సంస్థలు కలిసి బెంగుళూరులో దీనిని స్థాపించాయి. 2010 జూలై నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న UTC ని గుర్తిస్తూ కర్ణాటక రాష్ట్ర ఛీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ యశోదర్ మెనోన్ ఓ స్మారక స్టాంపును విడుదల చేశారు.

ఈ విధంగా UTC కి గౌరవం దక్కడం హర్షనీయమని పలువురు క్రైస్తవులు అభిప్రాయపడ్డారు.

# దయనీయ స్థితిలో ఒంగోలు ఎ.బి.యం. విద్యాసంస్థలు

క్రైస్తవ జాతి వృద్ధి, ఉన్నతి కొరకై ఎ.బి.యం. విద్యాసంస్థలు కొన్ని వేలమందిని గర్వించదగ్గ భారతీయులుగా తీర్చి దిద్దిందనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

అయితే అప్పటి పరిస్థితులకు, ఇప్పటి పరిస్థితులకు పొంతన లేదు. ఇప్పటి నాయకులు, అధ్యాపకులు ఎంత ప్రయత్నించిన వారి శక్తిమేర కృషి చేసినా అది చంద్రునికో నూలు పోగు అన్న చందంగా ఉంది.

హైస్కూలు, జూనియర్ కాలేజి, డిగ్రీ కాలేజి అధ్యాపకుల అవిశ్రాంత కృషి వర్ణనీయం. అయితే వారి కృషిని నీరుకారుస్తూ స్థానిక నాయకులు కాలేజి ప్రాంగణాన్ని తమ ప్రైవేటు పార్కింగ్ అడ్డాగా, తమ వివాహ వేదికలుగా మారుస్తున్నారు.

మే లో జరిగిన వివాహానికి అడ్డు అదుపు లేకుండా గోడలు పగులగొట్టిన 'నాయకుడు' తుతు మంత్రంగా గోడలు కట్టించి చేతులు దులుపుకున్నాడు. ఆ వివాహంలో ఎ.బి.యం. ఫుట్‌బాల్ గోల్ పోస్టులు మాయమయ్యాయి. ఇప్పటివరకు ఎన్నిసార్లు కళాశాల యాజమాన్యం సదరు "నాయకుని" వద్ద గోడు వెళ్ళబోసుకున్నా ఫలితం శూన్యం.

మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లు – మొన్న ఆ నాయకుడి ర్యాలి కొరకు వచ్చిన వాహనం ఎ.బి.యం. డిగ్రీ కాలేజి మెయిన్ గేటును బస్సుతో గుద్దింది. తమకు ఏమి అన్నట్లు వాహనాలను లోపలికి తీసుకొనివెళ్ళారు. ఇప్పటికి కూడా ఆ మెయిన్‌గేటు రోడ్డుపై అలానే ఉంది. అసలే జీతాలులేని కళాశాల అధ్యాపకులు అది కట్టించుకునే స్తోమత లేక నిర్లిప్తంగా ఉండిపోయారు.

స్థానిక నాయకుడిని కూడా అడిగే ధైర్యం చేయలేక మిన్నకుండిపోయారు. ఈ విషయమై స్థానిక క్రైస్తవులలో ఏ మాత్రం చలనంలేదు. ఎవరి మీదనో సి.బి.ఐ. విచారణ ఉందని ప్రార్ధనలు చేసే క్రైస్తవులకు తమ ఆస్తులను పాడుచేస్తే కనీసం చీమ కుట్టినట్లు కూడా లేకుండా మౌనం దాల్చడం బహు శోచనీయం.